


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 150, పేజీలు - 08

శనివారం, నవంబర్ 8, 2025 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




# కేటీఆర్, కిషన్ రెడ్డి బ్యాడ్ బ్రదర్స్

## - సీఎం రేవంత్ సంచలన వ్యాఖ్యలు

- హైడ్రాపై కక్ష గట్టిన కేటీఆర్
- హరీష్‌తోనే బీఆర్ఎస్‌కు ముప్పు
- అభివృద్ధిని అడ్డుకునేది బీజేపీ, బీఆర్ఎస్



**హైదరాబాద్** జూబ్లిహిల్స్ నియోజకవర్గ ప్రజలు అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రారం సాగుతున్న సమయంలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు చేస్తున్న ఆరోపణలపై ఆయన స్పందించారు. 2004 నుంచి 2014 వరకు పదేళ్లు రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉంది. 2014 నుంచి 2023 వరకు రాష్ట్రంలో బీఆరెస్, కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉంది కాంగ్రెస్, బీఆరెస్ అభివృద్ధిని పోల్చి చూసి ఓటు వేయాలని ప్రజల్ని కోరారు. హైదరాబాద్ లో అంతర్జాతీయ ఎయిర్ పోర్ట్, మెట్రో, నాలెడ్జ్ సెంటర్స్, ఐటీ, ఫార్మా ఇలా అన్ని రంగాల అభివృద్ధికి కాంగ్రెస్ బీజం వేసిందిని కానీ బీజేపీ, బీఆర్ఎస్ కలిసి విధ్వంసం చేశాయని మండిపడ్డారు.

### - బీజేపీ, బీఆర్ఎస్ కలిసి హైదరాబాద్‌లో విధ్వంసం

ఐటీఐఆర్ హైదరాబాద్ రాకుండా చేసింది బీఆరెస్, బీజేపీ కాదా అని రేవంత్ ప్రశ్నించారు. కాంగ్రెస్ తీసుకున్న ప్రణాళికలతోనే హైదరాబాద్ ఆదాయం పెరిగిందని వరదల్లో హైదరాబాద్ మునిగిపోతే కిషన్ రెడ్డి కేంద్రం నుంచి చిల్లిగవ్వ తీసుకురాలేదన్నారు. సచివాలయంలో ఆలయం కూల్చేస్తే కిషన్ రెడ్డి స్పందించలేదన్నారు. కాళేశ్వరం కట్టి లక్ష కోట్లు గోదావరిపాలు చేశారని మండిపడ్డారు. ప్రగతి భవన్ కేసీఆర్ కు, ఆయన కుటుంబానికి మాత్రమే ఉపయోగపడింది కొడుకు కోసం వాస్తు సరిద్దడానికి ఉన్న సచివాలయాన్ని కూల్చి కొత్తది కట్టారని సచివాలయం నిర్మిస్తే ఎవరికైనా ఉద్యోగాలు వచ్చాయా.? ఎవరికైనా పనికొచ్చిందా అని రేవంత్ ప్రశ్నించారు. పేద ప్రజలకు ఆ సచివాలయంతో ఏమైనా ప్రయోజనం ఒనగూరిందా చెప్పాలన్నారు. ఫోన్ ట్యాపింగ్ కోసం కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేసుకున్నారని సద్దాం హుస్సేన్ లా ప్రాణభయంతో తనను తాను కాపాడేందుకు ప్రగతి భవన్ లో బుల్లెట్ ప్రూఫ్ బాత్రూమ్ లు కట్టుకున్నాడన్నారు. 8 లక్షల 11 వేల కోట్ల అప్పుతో మాకు రాష్ట్రాన్ని అప్పగించారని విమర్శించారు.

### - కాంగ్రెస్ ఏర్పాటు చేసిన సంస్థలతోనే హైదరాబాద్‌కు గుర్తింపు

ఆనాడు కాంగ్రెస్ ఏర్పాటు చేసిన విద్యా సంస్థలే మనకు అంతర్జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చాయని రేవంత్ అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఐటీఐఆర్ ను రద్దు చేయడం తప్ప వీళ్లు ఒక్క అదనపు ఎయిర్ పోర్టునైనా తేలేదన్నారు. పదేళ్లలో మెట్రోను ఒక కిలోమీటరైనా విస్తరించలేదు నగర

2లో..

## వందేమాతరం ఒక మంత్రం..

# తరతరాలకు స్ఫూర్తి

- వందేమాతరం 150 ఏళ్ల ఉత్సవాలను ప్రారంభించిన ప్రధాని మోదీ
- ఈ సందర్భంగా స్మారక నాణెం, పోస్టల్ స్టాంపును ఆవిష్కరించిన ప్రధాని
- వందేమాతరం దేశ ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందని వ్యాఖ్య
- దేశవ్యాప్తంగా ఏడాది పాటు కొనసాగనున్న వేడుకలు




న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) భారత జాతీయ గీతం 'వందేమాతరం' 150వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఏడాది పాటు జరిగే ఉత్సవాలను ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఢిల్లీలోని ఇందిరా గాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన వందేమాతరం స్మారక నాణెం, పోస్టల్ స్టాంపును ఆవిష్కరించారు. ఈ గీతం దేశ ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందని, తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉందని

2లో..





# లక్ష కోట్ల ప్రాజెక్టులు ఆమోదం

## - సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఎస్ఐపీబీ సమావేశం

- రూ.1,01,899 కోట్ల విలువైన 26 పరిశ్రమలకు రాష్ట్ర పెట్టుబడుల బోర్డు ఆమోదం
- ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో 85,570 మందికి ఉపాధి అవకాశాలు
- గత 16 నెలల్లో మొత్తం రూ. 8 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయన్న ప్రభుత్వం
- ప్రాజెక్టులు క్షేత్రస్థాయిలో ప్రారంభమయ్యేలా చూడాలని అధికారులకు సీఎం ఆదేశం

**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఏపీలో కూటమి సర్కార్ పెట్టుబడుల వరద పారిస్తోంది. రాష్ట్రంలో పెట్టుబడుల రాకకు అనుకూలమైన వాతావారణాన్ని కల్పిస్తూనే మరోవైపు పారిశ్రామిక వేత్తల్ని స్వయంగా కలిసి ఆహ్వానాలు పలుకుతోంది. దీని ప్రభావం క్రమంగా కనిపిస్తోంది. శుక్రవారం సీఎం చంద్రబాబు నేతృత్వంలో జరిగిన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశంలో

2లో..

## ఎన్నికల చోరీల ద్వారా మోదీ ప్రధాని అయ్యారు

### - ఈ విషయాన్ని జెన్ జీ యువతకు వివరిస్తానన్న రాహుల్



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) నరేంద్ర మోదీ ఎన్నికల చోరీలతో ప్రధానమంత్రి పదవిలోకి వచ్చారంటూ లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. బీజేపీ వ్యవస్థీకృతంగా ఎన్నికల చోరీలకు పాల్పడుతోందని, ఈ నిజాన్ని దేశ యువత (జెన్ జీ) ముందు ఆధారాలతో సహా ఉంచుతానని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం ఢిల్లీలో జరిగిన 'హెచ్-ఫైల్స్' మీడియా

2లో..

## గోపీనాథ్ ఆస్తుల పంపకంలో

# రేవంత్, కేటీఆర్ మధ్య తేడాలు

## - బండి సంజయ్ సంచలన ఆరోపణలు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మరోమారు సంచలన ఆరోపణలు చేశారు. మాగంటి గోపీనాథ్ ఆస్తుల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ మంత్రి కేటీఆర్ కన్నేశారని చెప్పారు. ఆస్తి పంపకాల్లో ఇద్దరి మధ్య గొడవలు వచ్చాయన్నారు. గోపీనాథ్ మరణంపై తల్లే అనుమానం వ్యక్తం చేస్తోందని అయినా ముఖ్యమంత్రిసహా కాంగ్రెస్ నేతలెవరూ స్పందించడం లేదని అన్నారు. సీఎంకు నిజంగా చిత్తుశుద్ధి ఉంటే గోపీనాథ్ మరణంతోపాటు ఆస్తిపాస్తులపై సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలు నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు.
బీజేపీ ఆఫీస్‌లో మీడియాతో మాట్లాడిన బండి సంజయ్ జూబ్లిహిల్స్ ఉపఎన్నికలో ఎన్నికల కమిషన్, పోలీసు అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించడం లేదన్నారు. "కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ఈసీ, పోలీసులు, కొమ్ముకాస్తున్నారు. తెలంగాణలో అధికార, ప్రతిపక్షాలు కలిసి పని చేస్తున్నాయి. కూడబలుక్కునే తిట్టుకుంటున్నారు. మేం ప్రచార సభలకు అనుమతి కోసం దరఖాస్తు

2లో..

## రేవంత్ రెడ్డి వార్నింగ్

# ఎఫెక్ట్

### - ప్రైవేటు కాలేజీల సమ్మె విరమణ



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలతో తెలంగాణ ప్రభుత్వం జరిపిన చర్చలు సఫలమయ్యాయి. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై కళాశాల యాజమాన్యాలతో చర్చలు జరిపారు. చర్చల అనంతరం బంద్ విరమిస్తున్నట్లు ఉన్నత విద్యా సంస్థల సమాఖ్య ప్రకటించింది. ప్రైవేటు కళాశాలలకు ఫీజు బకాయిలు చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. తక్షణమే రూ. 600 కోట్ల విడుదల చేస్తామని ఉప ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. మరో రూ. 300 కోట్లు త్వరలో చెల్లించడానికి హామీ ఇచ్చారు. గతంలోనూ రాష్ట్ర ప్రభుత్వం రూ. 600 కోట్లు ఫీజు బకాయిలు చెల్లించింది. రాష్ట్రవ్యాప్తంగా ఇంజినీరింగ్, ఫార్మసీ తదితర వృత్తి విద్యా కళాశాలలతో పాటు డిగ్రీ, పీజీ కళాశాలలు ఈ నెల 3వ తేదీ నుంచి బంద్ కారణంగా మూతబడ్డాయి. ప్రభుత్వంతో కళాశాల యాజమాన్యాలు జరిపిన చర్చలు సఫలం కావడంతో కళాశాలలు రేపటి నుంచి తెరుచుకోనున్నాయి.

## విద్యార్థుల జీవితాలతో

# ఆడుకుంటే తాట తీస్తా

## - ప్రైవేటు కాలేజీలకు సీఎం రేవంత్ స్ట్రాంగ్ వార్నింగ్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఫీజు రీఎంబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయలేదని సమ్మె చేస్తున్న కాలేజీల యాజమాన్యాలపై సీఎం రేవంత్ రెడ్డి సీరియస్‌అయ్యారు. మీడియాతో మాట్లాడిన ఆయన యాజమాన్యాల సంగతి చూస్తామని హెచ్చరించారు. తెలంగాణలో ప్రైవేట్ ప్రొఫెషనల్ కాలేజీల స్ట్రైక్ నాలుగు రోజులుగా సాగుతోంది. రీఇంబర్స్‌మెంట్ డ్యూస్ రూ. 10,000 కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 3 నుంచి అన్ని కాలేజీలు మూసివేశారు.

### ఫీజుల బకాయిలు ఇవ్వలేదని ప్రైవేటు కాలేజీల బంద్

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి

2లో..

# వరల్డ్ కప్ విజేత శ్రీచరణికి గ్రూప్-1 ఉద్యోగం

## - భారీ నజరానా ప్రకటించిన ప్రభుత్వం



**అమరావతి (ప్రశ్న న్యూస్)** 2025 వరల్డ్‌కప్‌లో విజయం సాధించిన జట్టులో ఉంటూ కీలక పాత్ర పోషించిన శ్రీచరణికి ఆంధ్రప్రదేశ్‌లోకి గ్రాండ్ వెల్కం లభించింది. ఆమె ప్రతిభను మెచ్చిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భారీ నజరానా ప్రకటించింది. ఆమెను స్ఫూర్తిగా తీసుకొని మరికొందరు క్రీడాకారులు ఛాంపియన్‌లుగా మారి దేశానికి ఖ్యాతిని తీసుకురావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. గ్రూప్-1 ఉద్యోగం, ఇంటి స్థలం, రెండున్నర కోట్ల నగదు ఇవ్వాలని నిర్ణయించారు. శుక్రవారం ఉదయం గన్నవరం విమానాశ్రయంలో ఏసీఏ ఆధ్వర్యంలో శ్రీచరణికి ఘన ఘనస్వాగతం లభించింది. శ్రీచరణికి మహిళ మంత్రులు వంగలపూడి అనిత, సవిత, సంధ్యారాణి సాదరంగా ఆహ్వానించారు. ఆమెకు పుష్పగుచ్ఛం అందించి ఏసీఏ అధ్యక్షుడు కేశినేని

2లో..

## రైల్వే స్టేషన్లు, బస్టాండ్లలో

# వీధి కుక్కలు ఉండకూడదు

### పెరుగుతున్న కుక్కకాటు ఘటనలపై సుప్రీంకోర్టు ఆందోళన



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) దేశవ్యాప్తంగా వీధికుక్కలు, రహదారులపై తిరిగే పశువుల నియంత్రణపై సుప్రీంకోర్టు తాజాగా కీలక ఆదేశాలు జారీ చేసింది. ముఖ్యంగా రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు,

2లో..

## వీళ్లను అసలు

# ఆటగాళ్లు అంటారా.?

2లో..

### - క్రికెటర్లు సురేశ్ రైనా, శిఖర్ ధావన్‌పై సజ్జనార్ ఆగ్రహం



## కాంగ్రెస్‌కు ఓటేస్తే

# మూడేళ్లు నరకయాతన

### - రేవంత్ రెడ్డి సినిమా హీరోలను జైల్లో పెట్టారన్న హరీశ్ రావు




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** సినిమా హీరోలను జైల్లో పెట్టిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇప్పుడు సినిమా కార్మికులకు ఒంగి ఒంగి దండాలు పెడుతున్నారని బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు విమర్శించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన 'మీట్ ది ప్రెస్'లో మాట్లాడుతూ, జూబ్లిహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ గెలిస్తే మూడేళ్ల పాటు

2లో..

# కేటీఆర్, కిషన్ రెడ్డి బ్యాడ్ బ్రదర్స్

విస్తరణతో పాటు మెట్రో విస్తరణ ఎందుకుచేయలేదని ప్రశ్నించారు. పదేళ్లలో 20 లక్షల కోట్ల బడ్జెట్ ను ఏం చేశారో సమాధానం చెప్పాలన్నారు. కాంగ్రెస్ నిర్మించిన ఔటర్ రింగ్ రోడ్డును కూడా అమ్ముకున్నారని తాము తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ తయారు చేసుకుంటున్నామని తెలిపారు.

## కిషన్ రెడ్డి, కేటీఆర్ బ్యాడ్ బ్రదర్స్

హైదరాబాద్ నగర ప్రజల కోసం పరితపించిన పీజేఆర్, శశిధర్ రెడ్డిని హైదరాబాద్ బ్రదర్స్ అనేవారు ఇప్పుడు కిషన్ రెడ్డి, కేటీఆర్ ను బ్యాడ్ బ్రదర్స్ అంటున్నారని రేవంత్ సెటైర్ వేశారు.మెట్రో, గోదావరి జలాలు, ఎలివేటెడ్ కారిడార్లు, ఫ్యూచర్ సిటీని బ్యాడ్ బ్రదర్స్ అడ్డుకుంటున్నారు .మేం వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్ పోర్టు లకు అనుమతులు తీసుకొచ్చాం మరిన్ని ఎయిర్ పోర్టులకు అనుమతులు తెచ్చే ప్రయత్నం చేస్తున్నాం డ్రై పోర్టు ఏర్పాటు కోసం గ్రీన్ ఫీల్డ్ హైవేను నిర్మించేందుకు అనుమతులు తెచ్చుకున్నాం ఎలీ లిల్లీ లాంటి కంపెనీ 1 బిలియన్ డాలర్స్ ఫార్మాలో పెట్టుబడులు పెడుతోందన్నారు. రెండేళ్లలో ఒక ఏడాది ఎన్నిక కోడ్ తో అభివృద్ధి జరగలేని మిగిలిన ఏడాదిలో 3 లక్షల కోట్లు పెట్టుబడులు తెచ్చామన్నారు. తెలంగాణ ప్రజలకు ఉపయోగంలేని ప్రగతి భవన్, కాళేశ్వరం, కమాండ్ కంట్రోల్, సచివాలయం చూపించి ఇంకా ఎన్నాళ్ళు కాలం గడుపుతారని బీఆర్ఎస్ ను ప్రశ్నించారు.

## హైడ్రా ఏం తప్పు చేసిందో చెప్పాలి

నగరంలోని 695 చెరువులలో 44 చెరువులను బీఆరెస్ కబ్జా చేసిందే. ఆక్రమించుకున్న చెరువులను విధించినందున హైడ్రా పై విషం చిమ్ముతున్నారని సీఎం ఆరోపించారు. బతుకమ్మ కుంటను ఆక్రమించుకున్న ఎడ్ల సుధాకర్ రెడ్డి ఎవరు బీఆర్ఎస్ కాదా.? సున్నం చెరువు, నల్ల చెరువును ఆక్రమించుకుంది నిజం కాదా చెప్పాలన్నారు. వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ నిర్మించి నగరంలో రోడ్లపై నీళ్లు నిలవకుండా చేసింది హైడ్రానో కాదో చెప్పాలన్నారు. ఈగల్ ఫోర్స్, హైడ్రా పై కేటీఆర్ కక్ష పెట్టుకున్నాడు. హైడ్రా ఎక్కడ తప్పు చేసిందో చెప్పు నిజ నిర్ధారణ కమిటీ వేద్దామని పిలుపునిచ్చారు.

## హరీష్ రావుకు ఒక్క అడుగే మిగిలింది

హరీష్ రావుకి ఒక్క అడుగే మిగిలి ఉందని, కేసీఆర్ కి ఆరోగ్యం బాగాలేదు. కేటీఆర్ కి తలకాయ బాగాలేదన్నారు. కేసీఆర్ కు అండగా నిలబడేవాళ్లని కబళించుకుంటూ వచ్చింది హరీషేనన్నారు. కేటీఆర్, కవిత కలిసి ఉంటే ఇబ్బంది అవుతుందని ఇద్దరి మధ్య గొడవ పెట్టాడన్నారు. కేసీఆర్ కుటుంబంతో ఉండే వాళ్ళందరినీ హరీష్ బీఆరెస్ నుంచి బయటకు పంపేశారు. బయట వాళ్ళందరికీ విజయవంతంగా బయటకు పంపాడు ఇప్పుడు ఇంట్లో కవితను కూడా బయటికి పంపేలా చేశారు. వీళ్లా తెలంగాణ రాష్ట్రాన్ని కాపాడేది అని రేవంత్ ప్రశ్నించారు. సర్వేలను తాను నమ్మనని సారు కారు పదహారు అన్నారు ఏమైందని ప్రశ్నించారు. వందకు తక్కువ కాదన్నారు బొక్క బోర్లా పడ్డారు బ్యాండు మేళంను పిలుచుకుంటే మనకు నచ్చిన పాటనే కొడతారని రేవంత్ సెటైర్ వేశారు. చంద్రబాబు అరెస్ట్ కు నిరసన తెలిపే హక్కు ఇవ్వని వాళ్ళకి మద్దతిస్తారా.? ఎన్టీఆర్ ఘాట్ తొలగించాలని ప్రయత్నం చేసిన వాళ్ళకి ఓటేస్తారా? అని టీడీపీ కార్యకర్తలను రేవంత్ ప్రశ్నించారు.

# వందేమాతరం ఒక మంత్రం.. తరతరాలకు స్ఫూర్తి

ప్రధాని అన్నారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీ సీఎం రేఖా గుప్తా, కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, లెఫ్టినెంట్ గవర్నర్ వి.కె. సక్సేనా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ "నవంబర్ 7 ఒక చారిత్రకమైన రోజు. వందేమాతరం 150 ఏళ్ల మహోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ఈ పవిత్ర సందర్భం కోట్లాది మంది భారతీయులలో కొత్త స్ఫూర్తిని, శక్తిని నింపుతుంది. వందేమాతరం అనేది కేవలం ఒక పదం కాదు, అది ఒక మంత్రం, ఒక శక్తి, ఒక కల, ఒక సంకల్పం. ఇది మనల్ని మన చరిత్రతో అనుసంధానిస్తుంది. మన ఆత్మవిశ్వాసాన్ని పెంచి, మనం సాధించలేని కల ఏదీ లేదని గుర్తుచేస్తుంది" అని తెలిపారు. మాతృభూమి కోసం ప్రాణాలర్పించిన వీరులకు ఆయన నివాళులర్పించారు.కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ మాట్లాడుతూ, స్వాతంత్ర్య సంగ్రామానికి స్ఫూర్తినిచ్చిన గీతాన్ని స్మరించుకోవడం గర్వంగా ఉందన్నారు. "ప్రాణత్యాగం చేసిన వేలాది మంది స్వాతంత్ర్య సమరయోధులు చివరిగా పలికిన మాట వందేమాతరం అయి ఉంటుంది. వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించడానికి భారతీయులందరినీ ఏకం చేయగల శక్తి వందేమాతరానికి ఉంది" అని ఆయన అన్నారు. పౌరులు తమ గళంతో వందేమాతరం పాడి పంపేందుకు ఒక డిజిటల్ పోర్టల్‌ను కూడా ఈ సందర్భంగా ప్రారంభించారు. ఈ వేడుకల్లో భాగంగా ఉదయం 9:50 గంటలకు దేశవ్యాప్తంగా ప్రజలు ఉన్నచోటనే సామూహికంగా వందేమాతరం పూర్తి గీతాన్ని ఆలపించారు. పాఠశాలలు, కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాల్లో పౌరులు ఉత్సాహంగా పాల్గొని ఢిల్లీలోని ప్రధాన కార్యక్రమంతో గొంతు కలిపారు.

## చారిత్రక నేపథ్యం

1875 నవంబర్ 7న అక్షయ నవమి పర్వదినాన బంకించంద్ర ఛటర్జీ ఈ గీతాన్ని రచించారు. ఆయన రాసిన ప్రఖ్యాత నవల 'ఆనందమఠం'లో భాగంగా ఈ గీతం తొలిసారిగా 'బంగదర్శన్' అనే పత్రికలో ప్రచురితమైంది. మాతృభూమిని శక్తికి, సౌభాగ్యానికి ప్రతీకగా వర్ణించిన ఈ గీతం, అనతికాలంలోనే భారత స్వాతంత్ర్య ఉద్యమానికి, ముఖ్యంగా స్వదేశీ ఉద్యమానికి ప్రధాన నినాదంగా మారింది. భాషా, ప్రాంతీయ భేదాలను అధిగమించి జాతీయ చైతన్యానికి ప్రతీకగా నిలిచింది. 19వ శతాబ్దపు బెంగాల్ మేధావులలో ఒకరైన బంకించంద్ర ఛటర్జీ ఆధునిక భారత జాతీయవాద స్ఫూర్తిని రగిలించడంలో కీలక పాత్ర పోషించారు. ఈ ఉత్సవాలు 2026 నవంబర్ 7 వరకు కొనసాగుతాయి.

# లక్ష కోట్ల ప్రాజెక్టులు ఆమోదం

లక్ష కోట్ల పెట్టుబడి ప్రాజెక్టులకు ఆమోదం తెలిపారు. దీంతో 85,870 ఉద్యోగాలు రాబోతున్నాయి. రాష్ట్రంలో క్లస్టర్ వారీ విధానంలో పారిశ్రామికాభివృద్ధి జరగాలని సీఎం చంద్రబాబు 12వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశంలో ఆకాంక్షించారు. మూడు మెగా సిటీలు, 15 ఇండస్ట్రియల్ జోన్ల అభివృద్ధి చేస్తామని ఆయన తెలిపారు. పెట్టుబడుల సదస్సు కంటే ముందే వివిధ పరిశ్రమలకు శంకుస్థాపనలు ఉంటాయన్నారు.

గత 16 నెలలుగా జరిగిన ఎస్ఐపీబీ సమావేశాల్లో రూ.8,08,899 కోట్ల పెట్టుబడులు, 7,05870 ఉద్యోగాలకు గ్రీన్ సిగ్నల్ లభించినట్లయింది.పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చిన పరిశ్రమల నుంచి ప్రతిపాదనలు తీసుకోవడంతో పాటు అవి కార్యరూపం దాల్చేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. పరిశ్రమల కోసం అవసరమైన భూములు, విద్యుత్ లభ్యత కూడా ఉండేలా చూడాలని సూచించారు. ఇవాల్టి సమావేశంలో 26 పరిశ్రమలకు సంబంధించిన ప్రతిపాదనల్ని ఎస్ఐపీబీ ఆమోదించింది. వీటి ద్వారా రూ. 1,01,899 కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి రానున్నాయి. ఈ ప్రాజెక్టుల ద్వారా మొత్తంగా 85,570 ఉద్యోగాలు దక్కనున్నాయి. రాష్ట్రంలో వివిధ రంగాల్లో పెట్టుబడులు వచ్చేలా చూడటం అధికారుల బాధ్యతని చంద్రబాబు తెలిపారు. పెట్టుబడిదారుల నుంచి ప్రతిపాదనలు తీసుకుని సమయం వృధా కాకుండా తక్షణం ఆమోదం తెలియచేయాలన్నారు. ప్రభుత్వం నుంచి ఆమోదం పొందిన పరిశ్రమలు, ప్రాజెక్టులు గ్రౌండ్ అయ్యేలా చూసే బాధ్యతను అధికారులు తీసుకోవాలన్నారు. పెట్టుబడులు పెట్టే పరిశ్రమల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూడాలన్నారు. క్షేత్ర స్థాయిలో ఆయా పరిశ్రమల ఏర్పాటుకు కావాల్సిన అనుమతులను త్వరితగతిన వచ్చేలా శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు.రాష్ట్రంలో మూడు మెగా సిటీలు అభివృద్ధి చేయాలి. అనకాపల్లి నుంచి విజయనగరం వరకు విశాఖను మెగా సిటీగా అభివృద్ధి చేయాలని చంద్రబాబు సూచించారు. అలాగే తిరుపతి, అమరావతి నగరాలను కూడా మెగా సిటీలు చేయాలన్నారు

ఇప్పటికే అమరావతికి మాస్టర్ ప్లాన్ ఉందని, విశాఖ, తిరుపతి మెగా సిటీలకు కూడా మాస్టర్ ప్లాన్ రూపొందించాలని తెలిపారు. ఈ మెగా సిటీలను టూరిజం, ఐటీ సహా వివిధ పరిశ్రమలకు అనుకూలంగా ఉండేలా చూడాలన్నారు. ఈ మేరకు టూరిజం, ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్ శాఖలు సమన్వయం చేసుకుని ఈ మెగా సిటీలు అభివృద్ధి జరిగేలా చూడాలన్నారు. ఈ నెల, 14,15వ తేదీల్లో విశాఖలో జరగనున్న పెట్టుబడుల సదస్సును ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ప్రస్తుతం ఎస్ఐపీబీ ఆమోదించిన పరిశ్రమల్లో వేగంగా శంకుస్థాపనలు జరిగేలా చూడాలని సీఎం ఆదేశించారు. తనతో పాటు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ సహా వివిధ శాఖల మంత్రులు ఆయా జిల్లాల్లో పరిశ్రమలకు శంకుస్థాపనలు చేస్తామని తెలిపారు. ఆ దిశగా అధికారులు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఇక ఇటీవల తాను జరిపిన విదేశీ పర్యటనల్లో వివిధ కంపెనీలకు చెందిన ప్రతినిధులను భాగస్వామ్య సదస్సుకు ఆహ్వానించానని, వారు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు సుముఖంగా ఉన్నారని, అలాగే భాగస్వామ్య సదస్సుకు వచ్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారని వివరించారు.

# విద్యార్థుల జీవితాలతోఆడుకుంటే తాట తీస్తా

సమావేశంలో రాహుల్ మాట్లాడుతూ, "మా దగ్గర చాలా ఆధారాలున్నాయి. ఈ ప్రక్రియను మేం కొనసాగిస్తాం. నరేంద్ర మోదీ ఎన్నికలను ఎలా దొంగిలించి ప్రధాని అయ్యారో జెన్ జీ యువతకు స్పష్టంగా వివరిస్తాం. బీజేపీ ఎన్నికలను దొంగిలిస్తోంది. ఈ విషయంలో ఎలాంటి సందేహం లేదు" అని తీవ్రంగా విమర్శించారు.నకిలీ ఓట్లు, ఓటర్ల జాబితాలో నకిలీ ఫొటోలు వంటి అంశాలపై తాను చేసిన ఆరోపణలకు ఎన్నికల సంఘం (ఈసీ) నుంచి ఎలాంటి స్పందన రాలేదని రాహుల్ అన్నారు. బీజేపీ ఈసీని వెనకేసుకొస్తోందని, కానీ తాము చేసిన ఆరోపణలను మాత్రం ఖండించడం లేదని ఆయన పేర్కొన్నారు. తాము చూపుతున్న ఆధారాలన్నీ ఈసీ నుంచి సేకరించినవే అని తెలిపారు.ఓటర్ల జాబితాలో బ్రెజిల్‌కు చెందిన లారిస్సా నెరీ అనే మహిళ ఫొటోను చేర్చడం ఒక చిన్న ఉదాహరణ మాత్రమేనని రాహుల్ అన్నారు. "అసలు సమస్య నరేంద్ర మోదీ, అమిత్ షా, ఎన్నికల సంఘం కలిసి రాజ్యాంగంపై దాడి చేస్తుండటం. ఒకే వ్యక్తి బహుళ ఓట్లు వేయడం, ఒకే బూత్‌లో ఒక మహిళకు 200 ఫొటోలు ఉండటం వంటివి జరుగుతున్నాయి. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, హర్యానా, గుజరాత్‌లలో ఇది జరిగింది. ఇప్పుడు బీహార్‌లోనూ అదే చేయబోతున్నారు" అని రాహుల్ ఆరోపించారు. ఈ ఆరోపణల నేపథ్యంలో బ్రెజిల్ మహిళ లారిస్సా నెరీ కూడా ఒక వీడియో ద్వారా స్పందించారు. "భారత్‌లో ఎన్నికల కోసం ఎవరో నా పాత ఫొటోను వాడుకుంటున్నారు. అది నేను 18-20 ఏళ్ల వయసులో ఉన్నప్పటి ఫొటో. నన్ను భారతీయురాలిగా చూపి ప్రజలను మోసం చేస్తున్నారు" అని ఆమె తన వీడియోలో పేర్కొన్నారు.

## గోపీనాథ్ ఆస్తుల పంపకంలో

# రేవంత్, కేటీఆర్ మధ్య తేడాలు

చేస్తే జాప్యం చేస్తూ చివరి నిమిషంలో రద్దు చేస్తున్నారు. ఈరోజు రహమత్ నగర్‌లో సాయంత్రం సభకు పర్మిషన్ ఇవ్వాలని ఈనెల 4న దరఖాస్తు చేసుకున్నాం. నిన్నటిదాకా దీనిపై స్పందించలేదు. కానీ పొద్దున ఫోన్ చేసి అనుమతి ఇవ్వడం లేదని, వేరేచోట పెట్టుకోవాలని చెబుతున్నారు. మేం ఎక్కడ సభ పెట్టుకోవాలో కూడా వాళ్లే మాకు చెబుతున్నారంటే ఏమనాలి.? కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ఎక్కడ అడిగితే అక్కడ మీటింగ్‌కు అనుమతి ఇస్తున్నారు. చివరి నిమిషంలో ఎక్కడైనా అనుమతి ఇచ్చినా కండీషన్లు పెడుతున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు డీజేలు పెట్టుకోవడానికి, హంగామా చేయడానికి మాత్రం అనుమతి ఇస్తారు. ఇదేం ద్వంద్వ వైఖరి?. బీజేపీ సభలకు అనుమతిస్తే, ఒక వర్గం ఓట్లు రావనే భయం కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు పట్టుకుంది. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండు సీట్లను బీజేపీ గెలుచుకుంది. జూబ్లిహిల్స్‌లో బీజేపీ గెలవకూడదనే కుట్రతోనే మా సభలకు అనుమతి ఇవ్వడం లేదు. దొంగ సర్వేల పేరుతో బీజేపీ పోటీలో లేదంటూ తప్పుడు ప్రచారం చేయిస్తున్నారు." అని ఆరోపించారు.ప్రజల ఆలోచన మాత్రం కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు గుణపాఠం చెప్పాలని ఉందన్నారు బండి సంజయ్. ఈ విషయం తెలిసే కాంగ్రెస్ పార్టీ ముస్లింల మెప్పు పొందేందుకు యత్నిస్తోంది. జూబ్లిహిల్స్ ఎన్నికల్లో బీజేపీ వర్సెస్ ఇండియన్ ముస్లిం కాంగ్రెస్ మధ్యే పోటీ అన్నారు. కాంగ్రెస్‌కు ముస్లిం ఓట్లు కోసం మాత్రమే యత్నిస్తోంది. హిందువులంతా సత్తా ఏంటో చూపించాలన్నారు. "బీఆర్ఎస్ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ ముందే చేతులెత్తేసింది. జూబ్లిహిల్స్ ప్రజలారా, అభివృద్ధి కావాలా? అరాచక కావాలా? తేల్చుకోండి. కాంగ్రెస్ గెలిస్తే మజ్లిస్ గెలిచినట్లే అరాచకాలు, అక్రమాలకు తావిచ్చినట్లే. సీఎం రేవంత్ రెడ్డి ఓట్ల కోసం దిగజారి మాట్లాడుతున్నారు. కాంగ్రెస్ అంటేనే ముస్లింలు అని చెబుతున్నారు. దేశ జవాన్లను అవమానించేలా, హేళన చేసేలా మాట్లాడారు. మాగంటి గోపీనాథ్ మరణం విషయంలో ఆయన తల్లిని మానసిక క్షోభకు గురి చేశారు. కన్న కొడుకును కూడా కొడుకు గోపీనాథ్ ముఖం చూడనీయకుండా చేయడంపై అనేక అనుమానాలున్నాయి. నా కొడుకు మరణం ఒక మిస్టరీ అని గోపీనాథ్ తల్లే చెబుతోంది. అసలు గోపీనాథ్ చనిపోయింది ఎప్పుడు? ముందే చనిపోయారని చెబుతున్నారు. ఎవరి కోసమే ఆపారని చెబుతున్నారు." సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.గోపీనాథ్ మరణంపై సమగ్ర విచారణ జరపాలని సంజయ్ అన్నారు. "గోపీనాథ్ కుటుంబ సభ్యులు, ఆసుపత్రి యాజమాన్యం స్టేట్‌మెంట్లను రికార్డు చేయాలి. తన తండ్రిని చూడటానికి రావొద్దంటూ బీఆర్ఎస్ నేత మాజీ మంత్రి పువ్వాడ అజయ్ బెదిరించినట్లు గోపీనాథ్ కొడుకే ఆరోపించారు. అయినా సీఎం రేవంత్ రెడ్డి గుండె మాత్రం కరగడం లేదు. స్పందించడం లేదు. ఎందుకంటే గోపీనాథ్ ఆస్తులపై సీఎం రేవంత్ రెడ్డి, మాజీ మంత్రి ట్విట్టర్ టిల్లు మధ్య పంపకాల యవ్వారం ఉంది. అందుకే కేసీఆర్ కుటుంబంపై ఉన్న కేసులపై విచారణ జరగడం లేదు. అరెస్టు చేయడం లేదు. గోపీనాథ్ ఆస్తిపాస్తుల పంపకాల్లో కేటీఆర్, రేవంత్ మధ్య గొడవలు స్టార్ట్ అయ్యాయి. వీటి కోసమే వీరిద్దరి మధ్య పగలు, పట్టింపులు ఎక్కువయ్యాయి. గోపీనాథ్ చనిపోయాక ఆయన ఆస్తులను వీళ్లద్దరూ పంచుకున్నారు. దమ్ముంటే గోపీనాథ్ ఆస్తులెన్ని? అవన్నీ ఎటుపోయాయో చెప్పే దమ్ముందా? గోపీనాథ్ మరణం, ఆస్తుల వ్యవహారంపై విచారణ జరిపించే దమ్ము రేవంత్ రెడ్డికి ఉందా?. గోపీనాథ్ మరణంపై స్వయానా తల్లి ఆరోపణలపై ఇంతవరకు కాంగ్రెస్ ఎందుకు స్పందించడం లేదు?." అని నిలదీశారు.

# విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటే తాట తీస్తా

ఎ. రేవంత్ రెడ్డి ప్రైవేట్ కాలేజీ మేనేజ్‌మెంట్లకు కఠిన హెచ్చరిక జారీ చేశారు. "విద్యార్థుల జీవితాలతో ఆటలాడకండి, తమాషాలు చేస్తే తాటా తీస్తాం, రాజకీయ పార్టీలతో అంటకాగుతూ బ్లాక్‌మెయిల్ చేస్తే ప్రభుత్వం సహించదు" అని సీఎం స్పష్టం చేశారు. కాలేజీలలో సౌకర్యాలు ఉన్నాయో లేవో తనిఖీలు చేస్తే తప్పేమిటని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి వచ్చాకనే కొత్తగా సమస్యలు వచ్చినట్టు మాట్లాడకండి ముందు ప్రభుత్వాల్లో ఈ సమస్య లేదని చెప్పడం తప్పు. మీరు ఏ రాజకీయ పార్టీలతో అంటకాగుతున్నారో తెలుసని రేవంత్రెచ్చరించారు.

### బీఆర్ఎస్ కుట్రలో భాగమయ్యారని రేవంత్ అనుమానం - ఎలా డొనేషన్లు వసూలు చేస్తారో చూస్తానని హెచ్చరిక

అడిగినవి ఇవ్వకపోతే కాలేజీలు మూసేస్తామంటే ఊరుకునేది లేదన్నారు. బ్లాక్‌మెయిల్ చేస్తే ప్రభుత్వం సహించదని హెచ్చరించారు. ప్రభుత్వం విడతలవారీగా రీఎంబర్స్ మెంట్ నిధులు విడుదల చేస్తామని, కానీ స్ట్రైక్‌లు, రాజకీయ ఒత్తిడి చేస్తే తాట తీస్తామని స్పష్టం చేశారు. "కాలేజీలైనా, రాజకీయ పార్టీలైనా విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడితే ఉపేక్షించేది లేదు" అని కూడా చెప్పారు. వచ్చే ఏడాది నుంచి డొనేషన్లు ఎలా వసూలు చేస్తారో, ఫీజులు ఎలా అడుగుతారో చూస్తామని సీఎం హెచ్చరికలు జారీ చేశారు. కొన్ని మేనేజ్‌మెంట్లు 'అన్‌అకౌంటెడ్ ఫీ ' వసూలు చేస్తున్నాయని ఇప్పటికే ఆరోపణలు ఉన్నాయి. కొంత మంది కాలేజీ యాజమాన్యాల పేర్లు చెప్పిన సీఎం రేవంత్ వారి క్యాంపస్‌ల గురించి ప్రశ్నించారు.

### రేవంత్ కఠిన వైఖరితో కాలేజీల యాజమాన్యాలు దిగి వస్తాయా?

తెలంగాణలో ఫెడరేషన్ ఆఫ్ అసోసియేషన్స్ ఆఫ్ తెలంగాణ హయ్యర్ ఇన్‌స్టిట్యూషన్స్ కు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల పేద విద్యార్థులకు ఫీ రీఇంబర్స్ ప్రభుత్వం చేస్తుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సమయంలో డ్యూస్ పెరిగాయని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మరింత ఆలస్యమవుతున్నాయని కాలేజీలు ఆరోపిస్తున్నాయి. 50శాతం డ్యూస్ సుమారు ?5,000 కోట్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ భారీ సభ నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. అయితే అనుమతి రాలేదు. ఇప్పుడు రేవం త్ స్ట్రాంగ్ వార్నింగ్ బహిరంగంగా ఇవ్వడంతోకాలేజీలు ఏ నిర్ణయం తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది.

# వరల్డ్ కప్ విజేత శ్రీచరణికి గ్రూప్-1 ఉద్యోగం

శివనాథ్, సెక్రటరీ సానా సతీష్ బాబు, ట్రెజరర్ దండమూడి శ్రీనివాస్, శాప్ చైర్మన్ ఎ.రవినాయుడు అభినందనలు తెలిపారు.ఉమెన్ వరల్డ్ కప్ విజయంలో ఆంధ్ర అమ్మాయి శ్రీచరణి కీలకపాత్ర పోషించటం రాష్ట్ర ప్రజలకు ఎంతో గర్వ కారణమని ఏసీఏ ప్రెసిడెంట్ కేశినేని శివనాథ్ అభిప్రాయపడ్డారు. ఆమెకు స్వాగతం పలికేందుకు అభిమానులు కూడా ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్నారు. గన్నవరం నుంచి శ్రీచరణిని ఉండవల్లిలోని నివాసంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, నారా లోకేష్ నివాసానికి తీసుకెళ్లారు. అక్కడ ఆమెకు అత్యున్నతస్థాయిలో గౌరవం లభించింది. ఆమె ప్రతిభను చంద్రబాబు, లోకేష్ కితాబు ఇచ్చారు.

అనంతం మంగళగిరి క్రికెట్ స్టేడియంలో ఏ.సి. ఏ ఆధ్వర్యంలో శ్రీ చరణి మీడియా సమావేశం నిర్వహించారు. " ఏసీఏ నాకు అన్ని విధాలుగా తోడుగా నిలిచింది. ప్రభుత్వం గ్రూప్ 1 జాబ్ ఇస్తామని సీఎం చెప్పారు.2.5 కోట్ల నగదు , కడపలో స్థలం ఇస్తామని సీఎం చెప్పారు. మోడీతో సమావేశం జరిగినప్పుడు మరింత ముందుకు ఎలా వెళ్ళాలనే విషయం చెప్పారు." అని అన్నారు.అందరి అభిమానం చూస్తుంటే చాలా సంతోషంగా ఉందన్నారు శ్రీచరణి. "నాకు కుటుంబం నుంచి చక్కటి ప్రోత్సాహం ఉంది. మా మామ నన్ను క్రికెట్ ఆడిరచేవారు. నేను ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్‌లో శిక్షణ పొందాను. ఇది మొదటి అడుగు మాత్రమే. ముందు చాలా ఉంది. సీఎంను కలిసినప్పుడు చరణికి క్రికెట్‌పై మరింత దృష్టి పెట్టాలని చెప్పారని ఏసీఏ ప్రెసిడెంట్ కేశినేని శివనాథ్ తెలిపారు. "ఏసీఏ తరపున అన్ని సదుపాయాలు ఆటగాళ్లకు కల్పిస్తున్నాం. చరణి పేరుని విశాఖ స్టేడియంలో ఒక వింగ్‌కు పేరు పెడుతాం. మహిళా క్రికెటర్ అకాడమి త్వరలో ప్రారంభిస్తాం. మహిళా క్రీడాకారులను ప్రోత్సహించే విధంగా అవార్డ్స్ కూడా ఇస్తాం." అని ప్రకటించారు.

# కాంగ్రెస్‌కు ఓటేస్తే మూడేళ్లు నరకయాతన

నరకయాతన తప్పదని హెచ్చరించారు. వికాసానికి, విధ్వంసానికి మధ్య జరుగుతున్న ఈ ఎన్నికల్లో ప్రజలు తమకు ఏది కావాలో తేల్చుకోవాలని కోరారు. రేవంత్ రెడ్డి పాలనలో ఏ ఒక్క వర్గమూ సంతోషంగా లేదని ఆయన అన్నారు. కాంగ్రెస్ పాలనలో నలుగురు సోదరులు మాత్రమే సంతోషంగా ఉన్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని హామీలను రేవంత్ రెడ్డి విస్మరించారని ధ్వజమెత్తారు. ప్రజలను బ్లాక్‌మెయిల్ చేసి జూబ్లీహిల్స్‌లో ఓట్లు వేయించుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయకుంటే రేషన్ కార్డులు ఆగిపోతాయని, పెన్షన్ పెరగదని చెప్పడం సరికాదని హితవు పలికారు. కంటోన్మెంట్‌లో 6 వేల డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఏమయ్యాయో చెప్పాలని ఆయన నిలదీశారు. ప్రజలను మభ్యపెట్టి కంటోన్మెంట్‌లో కాంగ్రెస్ పార్టీ గెలిచిందని విమర్శించారు. రెండేళ్లుగా అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇవ్వని కాంగ్రెస్, జూబ్లీహిల్స్ ఎన్నికలు వచ్చాయని ఇప్పుడిచ్చిందని ఆరోపించారు. పీజేఆర్ మీద రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ పార్టీకి అంతగా అభిమానం ఉంటే 2023లో పీజేఆర్ కుమారుడికి టిక్కెట్ ఎందుకు ఇవ్వలేదో చెప్పాలని ప్రశ్నించారు.

# వీళ్లను అసలు ఆటగాళ్లు అంటారా.?

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) టీమిండియా క్రికెటర్లు సురేశ్ రైనా, శిఖర్‌ధావన్‌పై హైదరాబాద్ పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వీళ్లేం సెలబ్రిటీలని ప్రశ్నించారు. ఎక్స్ బెట్ మనీలాండరింగ్ కేసులో సురేష్ రైనా, శిఖర్ ధావన్‌లకు చెందిన రూ.11.14 కోట్ల ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అటాచ్ చేసింది. ఇందుకు సంబంధించిన వార్తా కథనంపై స్పందించిన సజ్జనార్ ఎక్స్‌లో ఒక పోస్టు చేశారు. అభిమానాన్ని కూడా సొమ్ము చేసుకునే వీళ్లు ఆదర్శనీయమైన ఆటగాళ్లు ఎలా అవుతారు? అని ప్రశ్నించారు.బెట్టింగ్ మహమ్మారికి వ్యసనపరులై ఎంతో మంది యువకులు తమ జీవితాలను చేజేతులా నాశనం చేసుకుంటున్నారని వీసీ సజ్జనార్ అన్నారు. వేలాది మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారని... సమాజాన్ని ఛిద్రం చేస్తోన్న బెట్టింగ్ భూతాన్ని ప్రచారం చేసిన వీరు వీటన్నింటికీ బాధ్యులు కారా? అని ప్రశ్నించారు. సమాజ మేలు కోసం, యువత ఉన్నతస్థానాలకు చేరుకోవడానికి సెలబ్రిటీలు నాలుగు మంచి మాటలు చెప్పాలని.. అంతేకానీ వారిని అభిమానించే వాళ్లను తప్పుదోవపట్టించి వారి ప్రాణాలను తీయవద్దని కోరారు.ఎక్స్ బెట్ మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ప్రధాన కార్యాలయం మనీలాండరింగ్ నిరోధక చట్టం, 2002 కింద సురేష్ రైనా, శిఖర్ ధావన్‌ల చరాస్తులు, స్థిరాస్తులను తాత్కాలికంగా అటాచ్ చేసింది. ఈడీ అటాచ్ చేసిన ఆస్తులలో సురేష్ రైనా పేరు మీద ఉన్న రూ.6.64 కోట్ల విలువైన మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులు, శిఖర్ ధావన్ పేరు మీద ఉన్న రూ.4.5 కోట్ల విలువైన స్థిరాస్తి ఉన్నాయి. ఇక, దేశవ్యాప్తంగా అక్రమ బెట్టింగ్ యాప్‌లను ఈడీ లక్ష్యంగా చేసుకుంది. వివిధ రాష్ట్రాలలో నమోదైన ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా దర్యాప్తు చేస్తుంది. ఆయా బెట్టింగ్ యాప్‌లతో ప్రముఖుల ఎండార్స్‌మెంట్ ఒప్పందాలు, వినియోగదారులను యాప్‌లు మోసం చేయాలనే ఆరోపణలు, పన్ను ఎగవేతపై ఈడీ లోతైన దర్యాప్తు చేస్తోంది. ఈ క్రమంలోనే బెట్టింగ్ ప్లాట్‌ఫామ్ ఎక్స్ బెట్ తో ముడిపడి ఉన్న మనీలాండరింగ్ దర్యాప్తుకు సంబంధించి భారత మాజీ క్రికెటర్ శిఖర్ ధావన్‌కు ఈడీ గతంలోనే సమన్లు జారీ చేసింది. టీమిండియా మాజీ క్రికెటర్ సురేష్ రైనాను కూడా ఇదే కేసులో ఎనిమిది గంటలకు పైగా ఈడీ ప్రశ్నించింది.

# రైల్వే స్టేషన్లు, బస్టాండ్లలో వీధి కుక్కలు ఉండకూడదు

ఆసుపత్రులు వంటి ప్రజా ప్రాంగణాల్లో కుక్కకాటు ఘటనలు ఆందోళనకరంగా పెరుగుతున్నాయని పేర్కొంటూ, ఆయా ప్రాంతాలను వీధికుక్కల రహితంగా మార్చాలని అధికారులను ఆదేశించింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్వీ అంజారియాలతో కూడిన ధర్మాసనం ఈ అంశంపై విచారణ చేపట్టింది. సంస్థాగత ప్రాంతాల్లో కుక్కకాటు కేసులు పెరిగిపోతుండటాన్ని తీవ్రంగా పరిగణించింది. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని, సంబంధిత అధికారులు సమన్వయంతో ఒక జాయింట్ డ్రైవ్ నిర్వహించి, ఈ ప్రాంతాల్లోని వీధికుక్కలను పట్టుకోవాలని స్పష్టం చేసింది. అదేవిధంగా, జాతీయ, రాష్ట్ర రహదారులతో పాటు ఇతర రోడ్లపై విచ్చలవిడిగా తిరుగుతున్న పశువుల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ధర్మాసనం అభిప్రాయపడింది. తక్షణమే చర్యలు చేపట్టి, రోడ్లపై ఉన్న పశువులను పట్టుకుని, వాటిని షెల్టర్ హోమ్‌లకు తరలించాలని ఆదేశించింది. వాటికి అవసరమైన సంరక్షణ, వసతులు కల్పించాలని సూచించింది. ఈ ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వాలు, జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) కచ్చితంగా అమలు చేయాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

# మోసాలకు పాల్పడుతూ.. జల్సాలు..!

మిర్యాలగూడ, : అమాయక యువతకు మాయమాటలు చెప్పి పలువురి నుంచి రూ.3 కోట్లు వసూలు చేసిన నిందితుడిని సూర్యాపేట పట్టణ పోలీసులు అరెస్టు చేసినట్లు సూర్యాపేట ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య తెలిపారు. ఇన్‌స్పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట మండలం బాషానాయక్ తండాకు చెందిన గడ్డం లక్ష్మణ్‌కుమార్ కొద్ది రోజులుగా సూర్యాపేట, తిరుమలగిరి, హైదరాబాద్ ప్రాంతాల్లో ఆన్లైన్ ట్రేడింగ్ పేరుతో, అలాగే నిరుద్యోగులకు ఉద్యోగాలు, ప్రఖ్యాత కళాశాలల్లో విద్యార్థులకు సీట్లు ఇప్పిస్తానంటూ నమ్మించాడు. తనకు రాజకీయ నాయకులు, విద్యాధికారులు తెలుసునని నమ్మిస్తూ అందినకాడికి దండుకున్నాడు. సూర్యాపేటకు చెందిన వెంకటేశ్వర్లు అనే వ్యక్తిని నమ్మించి, అతడి కుమార్తెకు ప్రముఖ కళాశాలలో ఇంజినీరింగ్ సీటు ఇప్పిస్తానని రూ.10 లక్షలు తీసుకొని మోసం చేయడంతో బాధితుడు మూడు నెలల క్రితం పట్టణ ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## బకాయిలున్నా..

# భరించాల్సిందేనా..!

నాగార్జునసాగర్, : వానాకాలం వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఉమ్మడి జిల్లాలో దాదాపు 60 వేల ఎకరాలలో కోతలు అయినట్లు అధికారులు చెబుతున్నారు. కొనుగోలు కేంద్రాలలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు కేటాయింపులు చేస్తూనే ఉన్నారు. మరో వైపు యాసంగిలో మిల్లులకు ఇచ్చిన సీఎంఆర్ ఇంకా పూర్తి కాలేదు. అది పూర్తి చేయకపోతే కొత్త సీఎంఆర్ ఇవ్వబోమని అధికారులు అంటున్నా.. సీజన్ ముమ్మరంగా జరిగే సమయంలో ధాన్యం తీసుకోక, కేటాయింపులు చేసుకోక తప్పని పరిస్థితి ఉంది.

## బీజేపీ ఓటర్ల కార్యశిలా

# జాబితా సమావేశంలో హాజరైన పైడి

నిజామాబాద్ అర్బన్, : హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జరగనున్న ఉప ఎన్నికల నేపథ్యంలో, రెహమాత్ నగర్‌లో బీజేపీ ఓటర్ల కార్యశిలా జాబితా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎల్లారెడ్డి సెగ్మెంట్ వాసి, బీజేపీ రాష్ట్ర నాయకులు డా. పైడి ఎల్లారెడ్డి పాల్గొన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై చర్చలు జరిగాయి. ఈ కార్యక్రమంలో మేడ్చల్ బీజేపీ అధికార ప్రతినిధి హైమరెడ్డితో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు కూడా పాల్గొన్నారు.

## 2వ వార్డు పరిధిలో అమృత్ 2. 0పనులు

# ప్రారంభించాలి

నిజామాబాద్ రూరల్, : ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని 2వ వార్డు పరిధిలో బస్టాండ్ డౌనల్, బీసీ కాలనీ, న్యూ అబాది ప్రాంతాల్లో అమృత్ 2.0 పైపులైన్ పనులను వెంటనే ప్రారంభించాలని స్థానికులు ఏఈ నిర్భయ్ ను శుక్రవారం కోరారు. ఈ పనులు సీసీ రోడ్డు నిర్మాణాలకు అడ్డంకిగా మారాయని వారు వివరించారు. వినతి మేరకు సోమవారం లేదా మంగళవారం పనులు ప్రారంభిస్తామని ఏఈ హామీ ఇచ్చినట్లు కాలనీ వాసులు మహేష్, నరేష్ తెలిపారు.

# ధాన్యం కుప్పను ఢీకొని రైతు మృతి

ఆర్మూర్, : బోధన్ మండలం బర్దీపూర్ గ్రామానికి చెందిన చిన్న గంగారాం (50) అనే రైతు ధాన్యం కుప్పను ఢీకొని చికిత్స పొందుతూ మృతిచెందినట్లు బోధన్ పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. చిన్న గంగారాం ఈ నెల 4న బోధన్ నుంచి గ్రామానికి తిరిగి వెళ్తున్నారు. ఈ క్రమంలో పాండుఫారం శివారులోని పెట్రోల్ బంకు దాటిన తర్వాత రోడ్డుపై ఉన్న ధాన్యం కుప్పకు తన ద్విచక్రవాహనం తగలడంతో రోడ్డుపై పడిపోయారు. దీంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌లో క్షతగాత్రుడిని జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ దవాఖానాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందారు.

## యువతి బలవన్మరణం..
## యువకుడికి పదేళ్ల జైలు శిక్ష

ఆదిలాబాద్, : ఆదిలాబాద్‌లో యువతి ఆత్మహత్యాయత్నానికి కారణమైన యువకుడికి న్యాయమూర్తి సీఎం రాజ్యలక్ష్మీ పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధించారు. తలమడుగు మండలం రుయ్యాడికి చెందిన ప్రణీష(21) అనే యువతిని కజ్జర్ల గ్రామానికి చెందిన ఉప్పారపు శ్రీనివాస్ ప్రేమిస్తున్నాడు. 2023 నవంబర్ 29న పార్కులో కలుసుకున్నప్పుడు పెళ్లికి నిరాకరించడంతో బాధితురాలు యాసిడ్ తాగింది. అనంతరం హైదరాబాద్ తరలిస్తుండగా మృతి చెందింది. ఈ కేసులో పది మంది సాక్షులను విచారించి, నేరాన్ని రుజువు చేయడంతో నిందితుడికి శిక్ష పడింది. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీసులను ఎస్పీ అఖిల్ మహాజన్ అభినందించారు.

## ఆదిలాబాద్ కలెక్టరేట్‌లో వందేమాతరం గీతాలాపన



బోథ్, : ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ, స్వాతంత్ర్య ఉద్యమంలో వందేమాతరం గీతం ప్రజలలో ఎంతో స్ఫూర్తిని నింపిందని తెలిపారు. బంకిం చంద్ర ఛటర్జీ రచించిన ఈ జాతీయ గీతానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం సామూహిక జాతీయ గీతాలాపన నిర్వహించారు. వందేమాతరం బ్రిటిషర్లపై పోరాటానికి స్ఫూర్తినిచ్చిందని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శ్యామలాదేవి, రాజేశ్వర్, ట్రైని కలెక్టర్ సలోని కూడా పాల్గొన్నారు.

## కలెక్టరేట్ లో ఘనంగా సామూహిక
## వందేమాతరం గేయాలాపన వేడుక

నిర్మల్, : నిర్మల్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఉదయం సామూహిక వందేమాతరం గేయాలాపన వేడుక జరిగింది. జాతీయ గేయం వందేమాతరం రచించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, అధికారులు వందేమాతరం గేయాన్ని ఆలపించారు. భారత స్వాతంత్ర్య సంగ్రామంలో వందేమాతరం గేయం ఎంతోమంది సమరయోధుల్లో స్వాతంత్ర్య ఉద్యమ కాంక్షను రగిలించడంలో కీలక భూమిక పోషించిందని, ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా నిర్వహించడం గర్వించదగ్గ విషయమని వారు అన్నారు.

## చలికి వణుకు.. చీకటైతే బిక్కుబిక్కు!

ముథోల్, : నిరుపేద విద్యార్థులు విద్యనభ్యసించేందుకు పోస్టు మెట్రిక్ వసతి గృహాలు ఏర్పాటు చేశారు. కానీ, కనీస సౌకర్యాలు లేకపోవడం, గ్రామాలకు దూరంగా నిర్మాణాలు చేపట్టడంతో నిత్యం విద్యార్థులు భయంగా గడపాల్సిన పరిస్థితి.. చలి గాలులకు, రాత్రి వేళల్లో బిక్కుబిక్కుమంటున్నారు. జిల్లాలో మొత్తం 12 పోస్టుమెట్రిక్ వసతి గృహాలు ఉన్నాయి. ఇచ్చోడలో 2, ఉట్నూరు 3, బజార్‌హత్నూర్ 1, ఆదిలాబాద్ 2, ఇంద్రవెల్లి 2, బోథ్‌లో 2 కొనసాగుతున్నాయి. 3 వేల మంది విద్యార్థులు అక్కడే ఉంటూ కళాశాలలకు వెళ్లి విద్యనభ్యసిస్తారు. గ్రామాలకు దూరంగా పంట పొలాలకు సమీపంలో ఉన్నాయి. కనీసం ప్రహరీలు కరవయ్యాయి. విషజీవులు, అడవి పందులు వస్తున్నాయి. ఉదయం, సాయంత్రం క్రీడలు ఆడే పరిస్థితి లేదు. కొన్నిచోట్ల అద్దె భవనంలో, ఇరుకు గదుల్లో కొనసాగుతున్నాయి. కిటికీలు సరిగా లేకపోవడంతో తమ వెంట తెచ్చుకున్న దుప్పట్లను అడ్డుగా పెట్టి వసతి పొందుతున్నారు.

## రైతుల ఆగ్రహం.. రాస్తారోకో

ఖానాపూర్, : కుమురం భీం జిల్లా వాంకిడి మండల కేంద్రంలోని జీవీపీ ఆగ్రో జిన్నింగ్‌మిల్లులో సీసీఐ ఆధ్వర్యంలో కొనుగోళ్లు ప్రారంభించారు. రైతులు పత్తి విక్రయించేందుకు కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకుని మిల్లుకు వచ్చారు. సీసీఐ అధికారులు తేమను పరిశీలించి 12 వాహనాలకు అనుమతినిచ్చి మిగతా వాటికి 12శాతానికి మించి తేమ ఉందంటూ నిరాకరించారు. దీంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ జాతీయ రహదారిపైకి చేరి రాస్తారోకో చేపట్టారు. వీరికి మాజీ సర్పంచి తుకారాం, ఆరె సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జైరాం, కాంగ్రెస్ నాయకులు ముండె దీపక్‌లు మద్దతు పలికారు. అధిక వర్షాలతో పత్తిలో తేమ అధికంగా ఉంటుందని, నిబంధనల పేరుతో ఇబ్బందులు పెట్టడంపై నిరసన వ్యక్తం చేశారు. ఎకరానికి ఏడు క్వింటాళ్లే కొంటామనే నిబంధన విధించడంపై ఆందోళన వ్యక్తం చేశారు.

## పెద్దపల్లిలో చిట్టీల పేరుతో
## రూ. 3 కోట్లు మోసం చేసినోడు అరెస్ట్

కరీంనగర్, : పెద్దపల్లి పట్టణంలో చిట్టీల పేరిట భారీ మోసం వెలుగులోకి వచ్చింది. ఠాకూర్ హనుమాన్ ప్రసాద్ అనే వ్యక్తి పలువురి నుంచి అధిక వడ్డీ, బై బ్యాక్ పాలసీ పేరుతో రూ.3 కోట్లు వసూలు చేసి ఉడాయించాడు.

బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దొరకకుండా తిరుగుతున్న హనుమాన్ ప్రసాద్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అతను ప్రభుత్వ ఉద్యోగులు, డాక్టర్లు, స్నేహితుల దగ్గర నుంచి డబ్బులు తీసుకున్నట్లు సమాచారం. అంతేకాదు, తన ఇంటిని కుమారుడి పేరిట గిఫ్ట్‌గా రిజిస్ట్రేషన్ చేసినట్లు బయటపడింది.

## కొడుకు కిడ్నాప్ అంటూ నకిలీ కాల్..
## తండ్రికి హైబీపీ

హుజూరాబాద్, : హుజురాబాద్ సమీపంలోని బోర్నపల్లికి చెందిన మాసాడి లక్ష్మణ్ రావుకు పాకిస్థాన్ నంబర్ నుంచి 'నీ కొడుకును కిడ్నాప్ చేశాం, వెంటనే రూ.50వేలు పంపించు' అంటూ నకిలీ కాల్ వచ్చింది.

అమెరికాలో ఉన్న తన కుమారుడిని సంప్రదించే ప్రయత్నం విఫలమవడంతో భయాందోళనకు గురైన లక్ష్మణ్ రావు హైబీపీతో కుప్పకూలిపోయారు. పోలీసులు స్పందించి ఆయనను హన్మకొండ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఆయన చికిత్స పొందుతున్నారు.

## వృద్ధురాలిపై కోతుల దాడి.. తీవ్ర గాయాలు

మానకొండూరు, : శంకరపట్నం మండలంలోని కరీంపేట గ్రామంలో రాత్రి సంబు ఐలమ్మ (70) అనే వృద్ధురాలిపై కోతుల గుంపు దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మండలంలో కోతుల బెడద ఎక్కువై వృద్ధులు, పిల్లలపై తరచూ దాడులు జరుగుతున్నాయని, అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## డిపివో కార్యాలయంలో
## జాతీయ గేయం ఆలపించిన ఎస్పీ



చొప్పదండి, : అఖండ భారతావనికి స్వాతంత్ర్య కాంక్షను రగిలించిన 'వందేమాతరం' గీతం శుక్రవారం 150 వసంతాలు పూర్తి చేసుకుంది. ఈ చారిత్రాత్మక సందర్భాన్ని పురస్కరించుకుని జిల్లా పోలీస్ కార్యాలయంలో సామూహిక వందేమాతరం గానాలాపన కార్యక్రమం జరిగింది. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తో పాటు పోలీస్ అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొని దేశభక్తి గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఎస్బీ ఇన్స్పెక్టర్ ఆరిఫ్ అలీ ఖాన్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు సైదులు, వేణు, మరియు ఇతర పోలీస్ సిబ్బంది కూడా పాల్గొన్నారు.

## సిరిసిల్ల విద్యార్థిని రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

సిరిసిల్ల, : సిరిసిల్ల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని సుధగొని లహరి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. ఎస్జిఎఫ్ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా పినపాక మండలం ఎద్దుల్ల బయ్యారంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నవంబర్ 8 నుండి 10 వరకు ఈ పోటీలు జరగనున్నాయి. లహరి శుక్రవారం రాష్ట్ర స్థాయి పోటీల కోసం బయలుదేరింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

## ఆలయ కూల్చివేత పనులు వేగవంతం

వేములవాడ, : వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వరస్వామివారి దేవస్థాన విస్తరణ, అభివృద్ధి పనుల్లో భాగంగా ఆలయ ఓపెన్ స్లాబ్ కూల్చివేత పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఆలయ ధర్మగుండం పక్కనున్న ఓపెన్ స్లాబ్‌లో హుండీ లెక్కింపు వేదిక, ఆర్జిత సేవల టికెట్ కౌంటర్లు ఉండేవి. విస్తరణ పనుల్లో భాగంగా ఈ భవనాన్ని తొలగిస్తున్నారు. ఇప్పటికే ఆలయ కళాభవన్, కల్యాణ కట్ట, ఎన్‌టీఆర్ వసతి గృహం, ప్రసాదాల తయారీ కేంద్రం, ఈవో కార్యాలయం, కోడెల క్యూలైన్ కొంత భాగాన్ని తొలగించారు. దీంతోపాటు ప్రధాన ఆలయంలోని క్యూలైన్లు, భారీ షెడ్లు పూర్తిగా తొలగించారు. భక్తులకు ఆలయంలో కేవలం లఘు దర్శనం మాత్రమే కల్పిస్తున్నారు. కోడె మొక్కులతోపాటు భక్తులు స్వామివారికి సమర్పించే ఆర్జిత సేవలు శ్రీ మేశ్వరస్వామివారి ఆలయంలో కొనసాగుతున్నాయి.

## ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో నేటి ధరలు

ఖమ్మం, : ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం మిర్చి, పత్తి ధరలు పెరిగాయి. క్వింటా ఏసీ మిర్చి ధర రూ. 15,700, నాన్ ఏసీ మిర్చి ధర రూ. 8,100, క్వింటా పత్తి ధర రూ. 7,100గా నమోదైంది. నిన్నటితో పోల్చితే ఏసీ మిర్చి ధర రూ. 325, నాన్ ఏసీ మిర్చి ధర రూ. 100 పెరిగింది. పత్తి ధర మాత్రం స్థిరంగా కొనసాగుతుందని వ్యాపారస్తులు తెలిపారు. మార్కెట్ కమిటీ సభ్యులు ఈ వివరాలను వెల్లడించారు.

## జమ్మిగూడెం పాఠశాలలో వందేమాతరం
## 150వ వార్షికోత్సవం ఘనంగా

మధిర, : అశ్వారావుపేట మండలంలోని జమ్మిగూడెం పాఠశాలలో మన జాతీయ గీతం 150 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా విద్యార్థులు, సిబ్బంది కలిసి జాతీయ గీతాన్నిశుక్రవారం ఆలపించారు. ఈ వేడుకల్లో పాఠశాల సిబ్బందితో పాటు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉపాధి అంచనాకు గ్రామసభలు

వైరా, : వలసలను అరికట్టి స్థానికంగా ఉపాధి కల్పించటమే ఉపాధిహామీ పథకం లక్ష్యం. ఏటా వేల సంఖ్యలో కూలీలు పనుల్లో పాల్గొని ఉపాధి పొందుతున్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పనుల గుర్తింపు కోసం గ్రామసభలు జరుగుతున్నాయి. స్థానిక ఎన్నికల కారణంగా ఆలస్యమైనా ఇప్పుడు మళ్లీ ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ఈ పథకంలో మొత్తం 266 పనులు జాబితాలో ఉన్నాయి. ఇంకుడు గుంతలు, పశువుల షెడ్లు, కోళ్లఫాం, భూ అభివృద్ధి, భూగర్భ జలాల పెంపు పనులకు ప్రాధాన్యమిస్తున్నారు. జిల్లాలో కొన్ని మండలాల్లో ఉపాధి పథకం గ్రామసభలు జరుగుతుండగా, మరికొన్ని మండలాల్లో నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. అంచనా విలువలతో పాటు పనుల సంఖ్య, అవసరమయ్యే కూలీల పనిదినాలను గుర్తిస్తారు. ఆ తర్వాత ఆమోదం కోసం మళ్లీ గ్రామసభలు నిర్వహించాల్సి ఉంటుంది. ముదిగొండ, కొణిజర్ల, ఏన్కూరు, కారేపల్లి, తల్లాడ, కల్లూరు, కూసుమంచి, బోనకల్లు, మధిర మండలాల్లో ఎక్కువ ఉపాధి పనులు జరుగుతాయి. గుర్తించిన పనులు ఆ ఏడాదిలోనే పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి.

## మద్యం మత్తులో పడుకుని ఉన్న వ్యక్తి..
## కారుతో తొక్కించిన యజమాని

పాలేరు, : మద్యం మత్తులో పడుకుని ఉన్న వ్యక్తిని కారు ఢీకొనటంతో మృత్యువాత పడిన సంఘటన ఖమ్మం మూడో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ మోహన్‌బాబు కథనం ప్రకారం.. స్థానిక ఎఫ్‌సీఐ బైపాస్ రోడ్డులోని ప్రైవేటు డిగ్రీ కళాశాల సమీపంలో నివాసం ఎదుట సుమారు 55ఏళ్ల వ్యక్తి మద్యం మత్తులో పడుకున్నాడు. గుర్తించని కారు యజమాని నాళం సతీశ్ ఇంట్లోకి వెళ్లే క్రమంలో ప్రమాదవశాత్తు తొక్కించడంతో నిద్రిస్తున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు.

చనిపోయిన వ్యక్తి వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తిగా భావించి అన్నం సేవా బృందం సహకారంతో సర్వజనాసుపత్రి శవాగారానికి తరలించి శవాగారంలో భద్రపరిచారు. ఆరా తీయగా సదరు వ్యక్తి కూసుమంచి మండలం చేగొమ్మకు కుసుమ ఉపేందర్(55)గా తేలింది. భార్యతో కలిసి ఖమ్మంలో ఓ కార్యక్రమానికి వచ్చిన అతను అతిగా మద్యం తాగి మత్తులో అక్కడ పడుకున్నట్టు గుర్తించారు. ఉపేందర్ కుమారుడు వినయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఇన్‌స్పెక్టర్ వివరించారు.

## వరంగల్‌లో రౌడీషీటర్
## సురేందర్ అండ్ గ్యాంగ్ అరెస్ట్ !

వరంగల్ ఈస్ట్, : వరంగల్ టాస్క్ ఫోర్స్ పోలీసులు నోటోరియస్ రౌడీ షీటర్ సురేందర్ అలియాస్ సూరి మరియు అతని గ్యాంగ్‌కి చెందిన ఏడుగురిని అరెస్టు చేశారు. శుక్రవారం (నవంబర్ 7, 2025) జరిగిన ఈ ఆపరేషన్‌లో రెండు రివాల్వర్లు, మూడు మ్యాగజైన్‌లు, ఒక బుల్లెట్, కత్తి స్వాధీనం చేసుకున్నారు. సూరిపై 46 క్రిమినల్ కేసులు నమోదు కాగా, రాచకొండ సిటీ బహిష్కరణ తర్వాత వరంగల్‌లో ఆశ్రయం తీసుకుని నేరాలకు పాల్పడుతున్నాడు. బీహార్ నుంచి రూ.50 వేల చొప్పున తుపాకులు కొనుగోలు చేసినట్లు పోలీసులు తెలిపారు. భూపాలపల్లిలో హత్య సుపారీ కేసులో కూడా విచారణ కొనసాగుతోంది.

## కారును తప్పించబోయి డివైడర్‌ను దాటివెళ్లిన ఆర్టీసీ బస్సు

వరంగల్ వెస్ట్, : ఔషాపూర్ వద్ద జనగామ నుంచి ఉప్పల్ వస్తున్న ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైంది. కారును తప్పించబోయి డివైడర్‌ను దాటి బస్సు మరో రూట్‌లోకి వెళ్లింది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 38 మంది ప్రయాణికులు ఉన్నారు. అదృష్టవశాత్తు ప్రయాణికులందరూ సురక్షితంగా బయటపడ్డారు. ఈ సంఘటనతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

## ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన మరో లారీ.. డ్రైవర్ మృతి

ములుగు, : ములుగు మండలం వంటిమామిడి సమీపంలోని రాజీవ్ రహదారిపై ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీ కొట్టింది. శుక్రవారం ఉదయం జరిగిన ఈ ఘటనలో డ్రైవర్ మృతి చెందారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ ప్రమాదంలో డ్రైవర్ హరీష్ సింగ్ అక్కడికక్కడే మృతి చెందినట్లు ములుగు ఎస్సై విజయ్ కుమార్ తెలిపారు.

## బదిలీ కోసం పైరవీలు

వర్ధన్నపేట, : ఉమ్మడి వరంగల్ జిల్లా దేవాదాయ శాఖలో కొందరు ఉద్యోగులు ప్రధాన ఆలయాల్లో పాతుకుపోయారు. ఏళ్ల తరబడి ఒకేచోట పనిచేస్తున్నారు. ఇతర ఆలయాలకు బదిలీలు చేస్తే వెళ్లేందుకు ఇష్టపడటం లేదు. వెళ్లినా.. ఏదో ఒక సాకు చెప్పి అయిదారు నెలలకే తిరిగి పాత స్థానానికి వస్తున్నారు. మేడారం మహా జాతర సమీపిస్తున్న వేళ ఆ ఆలయంలో పోస్టింగ్ కోసం ఓ ఉద్యోగి తహతహలాడుతున్నారు. గత కొన్ని రోజులుగా రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు, రాష్ట్ర దేవాదాయశాఖ అధికారుల చుట్టూ తిరుగుతున్నారని తెలిసింది. ఇందులో భాగంగానే అక్కడ కొత్తగా విధుల్లో చేరిన ఉద్యోగికి బాధ్యతలు ఇవ్వకుండా అడ్డుపడుతున్నారని ప్రచారం జరుగుతోంది. ఈ విషయం దేవాదాయశాఖ ఉద్యోగుల్లో చర్చనీయాంశంగా మారింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పెద్ద పెద్ద జాతరలు జరిగే ఆలయాలకు వెళ్లేందుకు కొందరు ఉద్యోగులు పైరవీలు చేస్తున్నారని తెలిసింది.

## ఆరని పొలాలు.. ఆగని కష్టాలు

పరకాల,: మొంథా తుపాను ధాన్యం విక్రయాలపై తీవ్ర ప్రభావాన్ని చూపింది. కొనుగోళ్లు ఊపందుకోవాల్సిన తరుణంలో పొలాలు బురదమయంగా మారి కోతలకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. అదనపు ఖర్చు భరించి.. యంత్రాలతో కోయించినా తేమశాతం వచ్చేలా ఆరబెట్టడంలోనూ ఇబ్బందులు తప్పడం లేదు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కోతలు మొదలైనచోట ప్రతికూల వాతావరణ పరిస్థితుల మధ్య కొనుగోళ్ల ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు కేవలం 17,460 టన్నుల ధాన్యమే కొనుగోలు చేయడం గమనార్హం.

## శరవేగంగా వంద పడకల ఆసుపత్రి నిర్మాణం

నర్సంపేట, : గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రంలో వంద పడకల ఆస్పత్రిని నిర్మిస్తోంది. ఎమ్మెల్యే కడియం శ్రీహరి పట్టుబట్టి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఒప్పించి ఆస్పత్రి నిర్మాణానికి కృషి చేశారు. ఈ ఏడాది జనవరి 20న ఈ వైద్యశాల నిర్మాణానికి ప్రభుత్వం రూ.45.50 కోట్లు మంజూరు చేయగా, మార్చి 16న సీఎం రేవంత్‌రెడ్డి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. మే 12న ఎమ్మెల్యే కడియం శ్రీహరి శిలాఫలకాన్ని ఆవిష్కరించి పనులు ప్రారంభించారు. మరో 11 నెలల్లో ప్రారంభానికి సిద్ధమయ్యేలా పనులు వేగంగా జరుగుతున్నాయి. స్టేషన్‌ఘన్‌పూర్‌లో గతంలో ఆర్టీసీకి కేటాయించిన నాలుగెకరాల స్థలంలో ప్రస్తుతం ఈ వైద్యశాలను నిర్మిస్తున్నారు. జీ ప్లస్ 2 పద్ధతిలో మొత్తం 75,438 చదరపు అడుగుల వైశాల్యంతో నిర్మించనున్నారు.

## అల్లీపూర్ పాఠశాల
## విద్యార్థుల వందేమాతరం గానం

మెదక్, : మెదక్ జిల్లా, శివంపేట్ మండలం అల్లీపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు శుక్రవారం, దేశభక్తితో వందేమాతరం గీతాన్ని ఆలపించారు. 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, ఉపాధ్యాయులు, పోలీసులు పాల్గొన్నారు. విద్యార్థుల్లో దేశం పట్ల ప్రేమ, గౌరవాన్ని పెంపొందించడమే లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

## కలెక్టరేట్‌లో ప్రతిధ్వనించిన గీతం

నర్సాపూర్, : వందేమాతర గేయం రచించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జిల్లా కలెక్టరేట్ సముదాయ ఆవరణలో శుక్రవారం సామూహిక గీతాలాపన కార్యక్రమం జరిగింది. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, వందేమాతర గేయం దేశభక్తిని, స్వాతంత్ర్య సమరయోధుల్లో జాతీయ జ్వాలను రగిలించిన పాట అని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు, సిబ్బంది సమిష్టిగా పాల్గొని గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమం ఎంతో ఉత్సాహంగా సాగింది.

## కొడకండ్ల ప్రాథమిక పాఠశాలలో
## వందేమాతరం 150వ వార్షికోత్సవం



గజ్వేల్, : సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం కొడకండ్ల ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు మధునాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో వందేమాతరం 150వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించబడింది. విద్యార్థులకు ఈ జాతీయ గీతం ప్రాముఖ్యత, స్వాతంత్ర్యోద్యమ చరిత్ర, దేశభక్తి విలువలను వివరించారు. ఉపన్యాసాలు, క్విజ్‌లు నిర్వహించి విద్యార్థుల్లో దేశభక్తి స్ఫూర్తి నింపారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ శ్రీకాంత్, ఎఎసిసి చైర్మన్ కళ్యాణి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు

## తుక్కు దుకాణంలో అగ్నిప్రమాదం

దుబ్బాక, : దుబ్బాక పట్టణంలోని అంగడి బజార్‌లో ఉన్న ఓ తుక్కు (స్క్రాప్) దుకాణంలో ఉదయం అగ్నిప్రమాదం సంభవించింది. తుక్కు దుకాణంలోని వెనక వైపు నిల్వ ఉంచిన పాత సామగ్రి, పైపుల వద్ద ప్రమాదవశాత్తు మంటలు చేలరేగాయి. దీంతో అక్కడే ఉన్న రెండు పాత ద్విచక్ర వాహనాలకు మంటలు వ్యాపించడంతో ఆ ప్రాంతమంతా పొగ అలముకుంది. ఈ సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది అక్కడికి చేరుకొని ఫైర్ ఇంజన్ సహాయంతో మంటలు అదుపు చేశారు. అంగడి బజార్లో వ్యాపించిన భారీ పొగతో వాహనదారులు, వ్యాపారులు, హోటల్ నిర్వాహకులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. ఘటనా స్థలాన్ని దుబ్బాక ఎస్సై కీర్తి రాజు పరిశీలించారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.50వేల ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేశారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ముగ్గురికీ ఇది సవాల్

## - జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో గెలిచేదెవరు..?







**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నిక మూడు పార్టీలకు చెందిన ముగ్గురు ముఖ్య నేతలకు సవాల్ గా మారింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిలకు ఈ ఎన్నిక ఫలితాలు ఖచ్చితంగా వారి నాయకత్వంపై ప్రభావం చూపుతుంది. అందుకోసం ఈ ఎన్నిక కోసం కాళ్లకు బలపం కట్టుకుని మరీ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో తిరుగుతున్నారు. ఈ ఎన్నికల్లో వ్యక్తిగత విమర్శలతో పాటు పార్టీలు, ప్రభుత్వ పనితీరుపై కూడా పెద్దయెత్తున ఆరోపణలు చేస్తుండటంతో ఎన్నికకు సంబంధించి హీట్ పెరుగుతుంది. ఎన్నికల ప్రచారానికి మరో రెండు రోజులు మాత్రమే సమయం ఉండటంతో ఇక అన్ని పార్టీలూ ప్రచారాన్ని ఉధృతం చేశారు.

### ముఖ్యమంత్రి పాలనపై..

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలనపై రెఫరెండంగా భావించాలని బీఆర్ఎస్ గట్టిగా ఎన్నికల ప్రచారంలో చెబుతుంది. గత రెండేళ్ల నుంచి ఆయన పనితీరుకు ఈ ఎన్నికలకు అద్దం పడతాయని అంటున్నారు. అలాగే ఇప్పటికే కంటోన్మెంట్ ఉప ఎన్నికలో గెలిచిన ఉత్సాహంతో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికలోనూ గెలుపు తమదేనని పైకి ధీమాగా కనిపిస్తున్నప్పటికీ ప్రజా తీర్పు ఎలా ఉంటుందన్న దానిపై మాత్రం ఒకింత ఆందోళన మాత్రం కనిపిస్తుంది. రెండేళ్ల లో గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయలేదని, అనేక హామీలను తుంగలోకి తొక్కారని, కేసీఆర్ హయాంలో జరిగిన హైదరాబాద్ అభివృద్ధిపై చర్చకు ఎక్కడికైనా సిద్ధమని బీఆర్ఎస్ సవాల్ విసురుతుంది. ఈ ఎన్నికల ఫలితంతో కాంగ్రెస్ పార్టీలో అంతర్గత సమస్యలు కూడా సమసిపోతాయని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. ఓడిపోతే మాత్రం అసంతృప్తి నేతలు మరొకసారి చెలరేగిపోయే అవకాశముందన్న భయం పాలకుల్లో కనిపిస్తుంది.

### కేటీఆర్ నాయకత్వానికి..

అదే సమయంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా బాధ్యతలను చేపట్టిన తర్వాత జరుగుతున్న ఎన్నిక కావడంతో ఆయన నాయకత్వం, పనితీరుపై కూడా ఈ ఎన్నిక ఫలితాలు ప్రభావం చూపుతాయని అంటున్నారు. ఇప్పటికే పార్టీ అధినేత కేసీఆర్ బయటకు రాకపోవడంతో కేటీఆర్ ఒక్కరే ఈ ఉప ఎన్నిక ప్రచారాన్ని త భుజస్కంధాలపై వేసుకుని ముందుకు సాగుతున్నారు. అభ్యర్థి ఎంపిక విషయంలో కూడా కేటీఆర్ మాట చెల్లుబాటు అయింది. ఈ ఎన్నికలలో గెలిస్తేనే రాష్ట్ంరలోని అన్ని నియోజకవర్గాల్లో నాయకులు యాక్టివ్ అవుతారని భావిస్తున్నారు. అదే ఓటమి పాలయితే మాత్రం ఈ ఎన్నిక తర్వాత పార్టీ క్యాడర్ మరింత నిరాశలోకి వెళ్లే అవకాశముంది. అందుకే కేటీఆర్ ఈ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రచారాన్ని ముమ్మరంగా చేస్తున్నారు.

### కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కి..

బీజేపీ నేత, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి కూడా జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఒక ఛాలెంజ్ అని చెప్పాలి. ఆయన అభ్యర్థి విషయంలో తన మాటే చెల్లుబాటు చేసుకున్నారు. దీంతో అభ్యర్థి దీపక్ రెడ్డిని గెలిపించుకోవాల్సిన బాధ్యత కిషన్ రెడ్డిపై పడింది. దీంతో కేంద్రమంత్రిగా ఉండి గల్లీ గల్లీ తిరుగుతూ ప్రచారంలో ముమ్మరంగా పాల్గొంటున్నారు. రాజాసింగ్ వంటి నాయకులు ఇప్పటికే ఈ ఎన్నికలపై విమర్శలు చేశారు. అభ్యర్థి ఎంపికతో పాటు తనను గెలిపించుకునే బాధ్యత కూడా కిషన్ రెడ్డి ఒక సవాల్ గా తీసుకుని ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. ప్రతి ఇంటి గడపకు వెళ్లేలా బీజేపీ శ్రేణులను సమాయత్తం చేశారు. ఈ ఎన్నికల్లో త్రిముఖ పోటీ ఉందని చెప్పి వేగంగా పార్టీని తీసుకెళుతున్నారు. దీంతో ఈ ఉప ఎన్నిక ముగ్గురిలో ఎవరికి పార్టీ నాయకత్వం పరంగా క్రేజ్ ను పెంచుతుందన్నది ఆసక్తికరంగా మారింది.

# చిన్నారుల నవ్వుల్లో ఏఎస్పీ దాతృత్వం

**- వేములవాడలో శేషాద్రిని రెడ్డి సేవా కార్యక్రమం**
**- చిన్నారుల మనసు గెలుచుకున్న వేములవాడ అదనపు ఎస్పీ : శేషాద్రిని రెడ్డి**
**- నిరుపేద పిల్లలకు గౌన్లు పంపిణీ**



వేములవాడ (ప్రశ్న న్యూస్) సేవలోనే సంతృప్తి,పేదలలో ఆనందమే తనకు అసలైన బహుమతిగా భావించిన వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి తన దాతృత్వాన్ని చాటుకున్నారు.శుక్రవారం వేములవాడ పట్టణంలోని బేడ బుడగ జంగాల కాలనీలో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల చిన్నారులకు స్వయంగా గౌన్లు పంపిణీ చేశారు. నూతన దుస్తులు అందుకున్న చిన్నారుల ముఖాల్లో వెలిగిన చిరునవ్వులు అక్కడ ఉన్న వారందరికీ హృదయాన్ని తాకాయి.ఈ సందర్భంగా ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి మాట్లాడుతూ "సమాజంలో సంతోషం పంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత. పేద చిన్నారుల కోసం చేసే చిన్న సహాయం కూడా వారికి పెద్ద సంతోషం ఇస్తుంది," అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వేములవాడ పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్,పోలీస్ సిబ్బంది, సేవా కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ నేపథ్యంలో ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి చేసిన ఈ సేవా కార్యక్రమం స్థానిక ప్రజల్లో ప్రశంసల వర్షం కురిపించింది.

## జర్నలిస్ట్ రాజశేఖర్ గౌడ్ కుటుంబానికి కాంగ్రెస్ నేత కనకం వంశీ కిరణ్ పరామర్శ - సంతాపం



కరీంనగర్ (ప్రశ్న న్యూస్) కరీంనగర్ – సీతారాంపూర్‌లో జర్నలిస్టు, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షులు ఆతికం రాజశేఖర్ గౌడ్ కుటుంబానికి ఇటీవల వారి తండ్రి రాములు మరణించడంతో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు,దళిత సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, హైకోర్టు న్యాయవాది కనకం వంశీ కిరణ్ శుక్రవారం పరామర్శించారు.ఈ సందర్భంగా వంశీ కిరణ్ రాజశేఖర్ గౌడ్ కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెబుతూ ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని తెలిపారు. కుటుంబ సభ్యులకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కరీంనగర్ రూరల్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు మీసాల సాయిలు,స్థానిక కాంగ్రెస్ నాయకులు,పలువురు జర్నలిస్టు మిత్రులు పాల్గొన్నారు.

# దేశభక్తి గీతాలాపనతో వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఉత్సాహం

**- వందేమాతరం దేశప్రేమకు, త్యాగానికి ప్రతీక**
**- వేములవాడ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ : శ్రీనివాస్**
**- విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించడమే ప్రధాన లక్ష్యం**
**దశగా వందే మాతరం గీతాలపన**
**- వేములవాడ రూరల్ సబ్ ఇన్స్పెక్టర్ : చల్లా వెంకట్రాజం**



వేములవాడ (ప్రశ్న న్యూస్)దేశభక్తి జ్వాలను రగిలించిన వందేమాతరం గీతం రచనకు 150 ఏళు పూర్తయిన సందర్భంగా వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక విద్యార్థులతో కలిసి వందేమాతరం గీతాన్ని సమూహంగా ఆలపించారు. అనంతరం విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వేములవాడ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, "వందేమాతరం" గీతం భారత జాతీయోద్యమానికి ఆత్మగా నిలిచింది. 1875లో బంకిమ్ చంద్ర చటర్జీ రచించిన ఈ గీతం స్వాతంత్ర్య సమరయోధులకు ప్రేరణగా మారింది. ఈ గీతం కేవలం పాట కాదు, దేశప్రేమ, త్యాగం, ఐక్యతలకు ప్రతీక అని తెలిపారు.అనంతరం వేములవాడ రూరల్ ఎస్ఐ చల్లా వెంకట్రాజం మాట్లాడుతూ విద్యార్థులలో దేశభక్తిని పెంపొందించడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై రవీందర్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ వెంకట్రాజం, కానిస్టేబుళ్లు వెంకటేష్, శ్రీనివాస్, సతీష్, ఆరిఫ్, రమేష్,లహరి ప్రియ,వినయ్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

సిద్దిపేట, : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గృహనిర్మాణ సంస్థ ఎండీ గౌతమ్ అన్నారు. కలెక్టరేట్‌లో ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు మొదలు పెట్టని వారికి వారం గడువు ఇవ్వాలని, ప్రారంభించకపోతే ఇతరులకు కేటాయించే విధంగా చూడాలన్నారు. ముగ్గు పూర్తి చేసిన గ్రామాల వివరాలు ప్రతిరోజూ నమోదు చేయాలని, గడువులోగా వందశాతం పూర్తి చేసేలా పర్యవేక్షణ బృందాలు చర్యలు తీసుకోవాలని సూచించారు. పంచాయతీ, వార్డుల వారీగా సమావేశాలు నిర్వహించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనుల్లో పురోగతి తీసుకురావాలని చెప్పారు. మండలాల్లో ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిని పర్యవేక్షిస్తూ, ఎప్పటికప్పుడు నివేదిక సమర్పించాలని ఎంపీడీఓలను ఆదేశించారు.

## నర్సింగ్ విద్యార్థిని పూజిత ఆత్మహత్యాయత్నం!

నాగర్ కర్నూల్, : ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నర్సింగ్ విద్యార్థిని పూజిత ఆత్మహత్యాయత్నం కలకలం రేపింది. నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలానికి చెందిన పూజిత, అవుషాపూర్‌లోని నీలిమా నర్సింగ్ కాలేజీలో చదువుతోంది. జ్వరంతో బాధపడుతున్నా కాలేజీకి వెళ్లి, భోజనం చేయకుండా ఎక్కువసేపు ఫోన్‌లో మాట్లాడింది. అనంతరం మూడో అంతస్తు నుంచి దూకి తీవ్రంగా గాయపడింది. ఆమె ఫోన్ స్టేటస్‌లో "ద ఎండ్" అని ఉండటం గమనార్హం. ప్రేమ వ్యవహారమే కారణమై ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

## నిజాయితీ చాటుకున్న మహిళలు

గద్వాల్, : గద్వాల్ పట్టణంలో రోడ్డుపై దొరికిన రూ.10వేల నగదును నిజాయితీగా ట్రాఫిక్ పోలీసులకు అప్పగించి, ఆ తర్వాత డబ్బు పోగొట్టుకున్న వ్యక్తికి అందజేయడంలో ముగ్గురు మహిళలు తమ నిజాయితీని చాటుకున్నారు. ఉదయం ప్రభుత్వ బాలికల పాఠశాల ముందు దొరికిన ఈ డబ్బును, దౌదర్ పల్లికి చెందిన ముగ్గురు మహిళలు గద్వాల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో ఉన్న ట్రాఫిక్ ఎస్సై బాచంద్రుడికి అప్పగించారు. శుక్రవారం డబ్బు పోగొట్టుకున్న తిమన్న అనే వ్యక్తి ట్రాఫిక్ కార్యాలయానికి వచ్చి, ఎస్సై విచారణ అనంతరం తన డబ్బును తిరిగి అందుకున్నాడు.

## వ్యక్తిపై హత్యాయత్నం.. రాడ్లతో దాడి చేసిన దుండగులు

ఆలంపూర్, : అలంపూర్ మండలం క్యాతూర్ శివారులో ఓ వ్యక్తిపై దారుణ హత్యాయత్నం జరిగింది. ఉండవెల్లి మండలం మారమునగాల గ్రామానికి చెందిన వెంకటేష్ క్యాతూర్ బ్యాంక్ పనులు ముగించుకుని బైక్‌పై తిరుగు ప్రయాణం అవుతుండగా, స్కార్పియో వాహనంలో వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు అతన్ని ఢీకొట్టి రాడ్లతో దాడి చేశారు. తీవ్రంగా గాయపడ్డ వెంకటేష్‌ను కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. గొడవ మధ్యవర్తిత్వమే దాడికి కారణమని అనుమానం.

## కల్వకుర్తి పట్టణంలో వందేమాతరం 150వ వార్షికోత్సవం ఘనంగా

కల్వకుర్తి, : కల్వకుర్తి పట్టణంలో శుక్రవారం ఉదయం ప్రభుత్వ పాఠశాల మైదానంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (%=ూా%) ఆధ్వర్యంలో భారత ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు వందేమాతర గీతాన్ని ఆలపించారు. వందేమాతర నిత్య చైతన్యం 150వ సంవత్సరాల సందర్భంగా ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక ఆర్ఎస్ఎస్ నాయకులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కొనుగోళ్లలో కిరికిరి.. కర్షకుల్లో అలజడి

మహబూబ్‌నగర్, : ఉమ్మడి జిల్లాలో గత నెల 22 నుంచి సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లు ప్రారంభించారు. కపాస్ కిసాన్ యాప్‌లో రైతులు స్లాట్ బుక్ చేసుకుని కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్తున్నారు. ప్రారంభం నుంచి ఎకరానికి 12 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. ఈ నెల 3 నుంచి సీసీఐ నిబంధనలు సడలించారు. ఎకరానికి 12 క్వింటాళ్ల సేకరణ బదులుగా 7 క్వింటాళు కొనుగోళ్లు చేపడుతున్నారు. వర్షాలకు నాణ్యత తగ్గిన పత్తిని ప్రైవేటుకు విక్రయించారు. రెండో దఫాలో తీసిన నాణ్యమైన పత్తిని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి నష్టాన్ని పూడ్చుకుందామనుకున్న రైతుల ఆశలు సీసీఐ నిబంధనలు సడలించటంతో ఆవిరయ్యాయి. దీంతో ఆగ్రహించిన రైతులు ఆయా కొనుగోలు కేంద్రాల వద్ద రాస్తారోకోలు చేపడుతున్నారు. అధికారులు హామీలు ఇచ్చి ఆందోళనలు విరమింపజేసినా నిబంధనల్లో ఏమాత్రం మార్పులేదని రైతులు వాపోతున్నారు. నిబంధనలు సడలించాలని కోరుతున్నారు.

## విద్యార్థిని చితకబాదిన వ్యాయామ ఉపాధ్యాయుడు

జడ్చర్ల, : విద్యార్థిని ఉపాధ్యాయుడు వాతలు వచ్చేలా కొట్టిన సంఘటన చోటు చేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం.. జడ్చర్ల పురపాలికలోని నాగసాల సమీపంలో ఉన్న మైనార్టీ గురుకుల బాలుర పాఠశాలలో ఆరో తరగతి విద్యార్థి గోడపై రాతలు రాశాడని తాత్కాలికంగా పని చేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయుడు కర్రతో కాలుపై వాతలు వచ్చేలా కొట్టారు. సాయంత్రం ఇంటికి చేరుకున్న విద్యార్థి కుటుంబ సభ్యులకు చెప్పాడు. వారు పాఠశాల వద్దకు చేరుకొని నిరసన వ్యక్తం చేశారు. పీడీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆసుపత్రిలో విద్యార్థికి చికిత్స అందించారు. విషయంపై ఆర్ఎల్సీ ఖాజా బహెూద్దీన్‌ను వివరణ కోరగా.. విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

## బీసీ రిజర్వేషన్లు హక్కు, భిక్ష కాదు:

నల్లగొండ, : జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ నల్లగొండ నియోజకవర్గంలో బీసీ జేఏసీ ఆధ్వర్యంలో రస్తారోకో నిర్వహించారు. బీసీ రిజర్వేషన్లు ఎవరు ఇచ్చే బిక్ష కాదని, ఇది తమ హక్కు అని జిల్లా బీసీ జేఏసీ చైర్మన్ మునాస ప్రసన్న కుమార్ తెలిపారు. 42శాతం రిజర్వేషన్లు సాధించేవరకు ఉద్యమం ఆగదని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘనాయకులు అయితగోనిజనార్ధన్ గౌడ్, గండి చెరువు వెంకన్న, కర్ణాటక యాదగిరి, మారయ్య, బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## గొర్రెలు అపహరించే ముఠా పట్టివేత

నకిరేకల్, : యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దేవలమ్మ నాగారం గ్రామంలో ఇటీవల గొర్రెలు, మేకల అపహరణ ఘటనలు పెరిగాయి. దీంతో అప్రమత్తమైన గొర్రెల కాపరులు అర్ధరాత్రి పూట గొర్రెల దొడ్ల వద్ద మాటువేశారు. ఈ క్రమంలో గొర్రెలను దొంగిలించడానికి వచ్చిన ఇద్దరు యువకులను పట్టుకున్నారు. వారిని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద చితకబాదగా, తాము ఎక్కడెక్కడ దొంగతనాలు చేశారో వెల్లడించారు. అనంతరం నిందితులిద్దరినీ చౌటుప్పల్ పోలీసులకు అప్పగించారు.

## అక్కను చూసేందుకు వెళ్తూ.. అనంత లోకాలకు

దేవరకొండ, : అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అక్కను చూసేందుకు వెళ్తున్న యువకుడు రోడ్డు ప్రమాదానికి గురై దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటన నల్గొండ జిల్లా చిట్యాల శివారులో జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. బీ ఎస్సై ఎం.రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం..

సూర్యాపేటలో నివాసం ఉంటున్న చంద్రగిరి స్నేహ కిడ్నీ సంబంధిత వ్యాధితో హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సూర్యాపేట మండలం కేసారం గ్రామానికి చెందిన పంతం సువర్ణరాజు (19) తన అక్కను చూసేందుకు ద్విచక్రవాహనంపై బుధవారం రాత్రి బయలుదేరాడు. చిట్యాల పట్టణం దాటాక పన్నెండున్నర గంటల సమయంలో హెచ్‌పీ పెట్రోల్ బంకు సమీపంలో బైక్ రోడ్డు ప్రమాదానికి గురైంది. ముందున్న వాహనాన్ని ఢీకొట్టడం లేదా.. ఇతర గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడం వల్ల ఈ ఘటన జరిగి ఉండొచ్చని ఎస్సై పేర్కొన్నారు. ప్రమాదంలో సువర్ణరాజు అక్కడికక్కడే మృతిచెందాడు.

## అక్కను చూసేందుకు వెళ్తూ.. అనంత లోకాలకు

మునుగోడు, : అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అక్కను చూసేందుకు వెళ్తున్న యువకుడు రోడ్డు ప్రమాదానికి గురై దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటన నల్గొండ జిల్లా చిట్యాల శివారులో జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది.

బీ ఎస్సై ఎం.రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేటలో నివాసం ఉంటున్న చంద్రగిరి స్నేహ కిడ్నీ సంబంధిత వ్యాధితో హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సూర్యాపేట మండలం కేసారం గ్రామానికి చెందిన పంతం సువర్ణరాజు (19) తన అక్కను చూసేందుకు ద్విచక్రవాహనంపై బుధవారం రాత్రి బయలుదేరాడు. చిట్యాల పట్టణం దాటాక పన్నెండున్నర గంటల సమయంలో హెచ్‌పీ పెట్రోల్ బంకు సమీపంలో బైక్ రోడ్డు ప్రమాదానికి గురైంది. ముందున్న వాహనాన్ని ఢీకొట్టడం లేదా.. ఇతర గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడం వల్ల ఈ ఘటన జరిగి ఉండొచ్చని ఎస్సై పేర్కొన్నారు. ప్రమాదంలో సువర్ణరాజు అక్కడికక్కడే మృతిచెందాడు.

## దేశభక్తి స్ఫూర్తితో బోయినిపల్లి పోలీసుల "వందేమాతరం" గీతం ఆలాపన

**- మనదేశ స్వాతంత్ర్యం ఉద్యమానికి ప్రేరణగా నిలిచిన " వందేమాతరం"**

**- బోయినిపల్లి సబ్ ఇన్స్పెక్టర్ : రమాకాంత్**




బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఎస్సై రమాకాంత్ ఆధ్వర్యంలో "వందేమాతరం" గేయానికి 150 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది,విద్యార్థులతో సమిష్టిగా దేశభక్తి ఉట్టిపడేలా "వందేమాతరం" గేయాన్ని ఆలపించారు.
ఈ సందర్భంగా ఎస్సై రమాకాంత్ మాట్లాడుతూ "వందేమాతరం గేయం భారతీయుల మనసుల్లో దేశభక్తి స్ఫూర్తిని నింపిన అజరామర గీతం. బంకిమ్‌చంద్ర చటర్జీ రచించిన ఈ గీతం మన దేశ స్వాతంత్ర్య ఉద్యమానికి ప్రేరణగా నిలిచింది. ప్రతి భారత పౌరుడూ దేశమాత పట్ల గౌరవం,సమర్పణతో ఈ గేయాన్ని జ్ఞాపకం చేసుకోవాలి," అని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పోలీస్ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.

## "వందేమాతరం" గీతం 150 ఏళ్ల స్ఫూర్తి

## - వేములవాడ పట్టణ పోలీసుల ప్రత్యేక కార్యక్రమం

**- వేములవాడ పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్ నేతృత్వంలో సమిష్టిగా "వందే మాతరం" గీతాలాపన**



వేములవాడ (ప్రశ్న న్యూస్) దేశ స్వాతంత్ర్య ఉద్యమానికి చైతన్య స్ఫూర్తినిచ్చిన "వందేమాతరం" గేయానికి 150 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా శుక్రవారం వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో దేశభక్తి వాతావరణం నెలకొంది. పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్ నేతృత్వంలో పోలీస్ సిబ్బంది, సమిష్టిగా "వందేమాతరం" గీతాన్ని ఆలపిస్తూ దేశమాతకు గౌరవ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీఐ వీరప్రసాద్ మాట్లాడుతూ "వందేమాతరం గీతం ప్రతి భారతీయుని మనసును కదిలించే అజరామర గీతం. బంకిమ్‌చంద్ర చటర్జీ రచించిన ఈ గేయం స్వాతంత్ర్య సమరయోధులలో అగ్ని జ్వాలలు రగిలించింది. మన దేశ పట్ల ప్రతి పౌరుడు అదే భక్తి, అదే గౌరవంతో ఉండాలి," అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, పాల్గొని దేశభక్తి నినాదాలతో ప్రాంగణాన్ని మార్మోగించారు. "జై హింద్", "వందేమాతరం" నినాదాలతో ఆవరణం ప్రతిధ్వనించింది.

### ఎబిజెఎఫ్ జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శిగా

## మాదస్తు రాజేష్ నియామకం

**- జర్నలిస్టు ఫెడరేషన్ సంక్షేమాభివృద్ధికి కృషి చేస్తా**

**- ఏబిజెఎఫ్ జగిత్యాల జిల్లా నూతన ప్రధానకార్యదర్శి : మాదస్తు రాజేష్**



జగిత్యాల (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర అఖిల భారత జర్నలిస్టు ఫెడరేషన్ (ఎబిజెఎఫ్) రాష్ట్ర జనరల్ సెక్రటరీ మహ్మద్ అబ్దుల్ ముస్సావీర్ ఆదేశాల మేరకు, జగిత్యాల జిల్లా అఖిల భారత జర్నలిస్టు ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మాదస్తు రాజేష్‌ను నియమించినట్లు ఎబిజెఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఇంద్రాల హరీష్ తెలిపారు. ఈ సందర్భంగా మాదస్తు రాజేష్ మాట్లాడుతూ, తన నియామకానికి కృషి చేసిన రాష్ట్ర, కేంద్ర ఎబిజెఎఫ్ నాయకత్వానికి ధన్యవాదాలు తెలుపుతూ, జర్నలిస్టుల సంక్షేమం, యూనియన్ బలోపేతం,జిల్లా స్థాయి కార్యకలాపాల విస్తరణకు కృషి చేస్తానని తెలిపారు. ఈ నేపథ్యంలో జగిత్యాల జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టు వర్గాల నుండి మాదస్తు రాజేష్‌కు అభినందనలు తెలియజేశారు.

## ప్రతి ఒక్కరూ తమ దేశభక్తిని చాటుకోవాలి

**కమిషనర్ వెంకట గోపాల్**




మేడ్చల్( ప్రశ్న న్యూస్) విద్యార్థులు ప్రతి ఒక్కరు దేశభక్తి ని చాటుపోవాలని గుండ్ల పోచంపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్ అన్నారు. గుండ్ల పోచంపల్లి మున్సిపల్ ఆవరణలో వందేమాతరం జాతీయ గీతాన్ని బంకిం చంద్ర చటర్జీ రచించి 150 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా సామూహికంగా వందేమాతరం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి గుండ్ల పోచంపల్లి మున్సిపల్ వెంకట గోపాల్ సామూహికంగా వందేమాతరం గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంకట గోపాల్ మాట్లాడుతూ బంకిం చంద్ర చటర్జీ వందేమాతరం జాతీయ గీతాన్ని రచించి 150 సంవత్సరాలు గడవడం హర్షనీయమని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి సైతం వందేమాతరం గీతాన్ని గుర్తుంచుకొని తమ ఆశయాలకు అనుగుణంగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో గుండ్ల పోచంపల్లి మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్ గౌడ్ తో పాటు పలు పాఠశాలల విద్యార్థులు, గుండ్ల పోచంపల్లి మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# తల్లాడ రింగ్ రోడ్ లో బోల్తా పడిన లారీ.

**స్పందించిన తల్లాడ ఎస్ఐ వెంకటేష్.**

**రెండు జెసిబిల సాయంతో లారీ కట్టెలను తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేసిన ఎస్ఐ వెంకటేష్.**





తల్లాడ, నవంబర్ 7 (ప్రశ్నన్యూస్): లారీ బోల్తా పడి డ్రైవర్ కు క్లీనర్ కు స్వల్ప గాయాలు ఆయన సంఘటన శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం. ఖమ్మం జిల్లా పాల్వంచ నుంచి వైష్ణవి పాల ఫ్యాక్టరీ కి పుల్లలు లోడ్ తో వస్తున్న లారీ తల్లాడ మండలంలోని రింగ్ రోడ్డు సమీపంలో మూలమలుపు వద్ద తిరుగుతుండగా
ఒక్కసారిగా బాధపడింది. దీంతో డ్రైవర్ క్లీనర్ కి స్వల్ప గాయాలు అయ్యాయి అయితే ఉదయం పూట జరగటం వల్ల రోడ్డు మీద జనాలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని చెప్పవచ్చు. అలాగే రింగ్ రోడ్డు సమీపంలో భారీ గుంటలు ఏర్పడడంతో భారీ లోడుతో వస్తున్న లారీలు వాహనాలు రింగ్ రోడ్ మూలమలుపు తిరగలేకపోవడంతోనే ఈ ప్రమాదం చోటు చేసుకుంటున్నాయని స్థానికులు అంటున్నారు.
ఏదిమైనా అధికారుల నిర్లక్ష్య ధోరణి వాహనదారుడు జాగ్రత్తలు ప్రకటించకపోవడంతో
ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని. ఇప్పటికైనా అధికారులు మేల్కొని రింగురోడ్డు సమీపంలో మరమ్మత్తు సేపిస్తే ఇలాంటి సంఘటనలు జరగవని ప్రజలు కోరుకుంటున్నారు. అదేవిధంగా లారీ బోల్తా పడిన సమయానికి వెంటనే స్పందించి ఎస్ఐ వెంకటేష్, రెండు జెసిబి ల సహాయంతో రోడ్డు మీద పడి ఉన్న వెహికల్ ని క్లియర్ చేయించాడు ఇంతటి సమయస్ఫూర్తితో స్పందించిన పోలీస్ సిబ్బంది వారికి ప్రజల అభినందనలు తెలియపరిచారు.

## బీఆర్ఎస్ పార్టీ ఫ్లెక్సీని తొలగించిన ఘటనపై పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు

**- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి**

**- బోయినిపల్లి మండల బీఆర్ఎస్ నేతలు**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, కొదురుపాక గ్రామంలో ఫ్లెక్సీ ఏర్పాటు చేయగా గుర్తు తెలియని వ్యక్తులు ఫ్లెక్సీని తొలగించిన ఘటనపై బీఆర్ఎస్ పార్టీ నాయకులు శుక్రవారం బోయినిపల్లి పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశారు.దీపావళి పండుగను పురస్కరించుకుని బోయినిపల్లి మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు కొదురుపాక గ్రామంలో పార్టీ తరపున శుభాకాంక్షలు తెలియజేస్తూ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. అయితే,రాత్రి వేళల్లో గుర్తు తెలియని వ్యక్తులు ఆ ఫ్లెక్సీని తొలగించడంతో నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.గ్రామ పంచాయతీ సిబ్బందిని విచారించగా, "మేము ఫ్లెక్సీ తీసివేయలేదు" అని సమాధానం ఇవ్వడంతో పార్టీ నాయకులు ఈ విషయమై బోయినిపల్లి పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశారు.తక్షణమే ఘటనపై దర్యాప్తు చేసి, దోషులను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని పోలీసులు కోరారు.ఈ సందర్భంగా సబ్ ఇన్స్పెక్టర్ రమాకాంత్ ఫిర్యాదు స్వీకరించి,దర్యాప్తు చేసి, నిందితులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గుంటి శంకర్,మాజీ సర్పంచ్ అక్కెనపల్లి కరుణాకర్,సోషల్ మీడియా కన్వీనర్ బత్తిని కమల్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కన్నం సాగర్,నల్ల సతీష్,జగన్ గౌడ్, మేకల మహేష్,దూస మధు, తదితరులు పాల్గొన్నారు.

## వందే మాతరం 150 ఏళ్ల సంస్మరణోత్సవం




కూకట్ పల్లి(ప్రశ్న న్యూస్) జాతీయ గేయం వందేమాతరం 150వ సంస్మరణ కార్యక్రమాన్ని బాలానగర్ పోలీస్ స్టేషన్ లో సీఐ నర్సింహా రాజు నేతృత్వంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు.పోలీస్ స్టేషన్ ఆవరణలో వందే మాతరం పూర్తి గేయాన్ని సామూహికంగా ఆలపించారు.అనంతరం సీఐ నర్సింహా రాజు మాట్లాడుతూ 2025తో వందేమాతరం గేయానికి 150 ఏళ్లు పూర్తయ్యాయని, స్వాతంత్ర్యోద్యమానికి స్ఫూర్తినిచ్చి, నేటికీ దేశ కీర్తిని, ఐక్యతను పెంపొందిస్తున్న చిరతరమైన ఈ గేయానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంస్మరణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఈ సందర్భంగా పేర్కొన్నారు. మన జాతీయ గేయం వందే మాతరాన్ని 1875 నవంబరు 7న అక్షయ నవమి శుభ వేళ బంకించంద్ర ఛటర్జీ రచించారని.. బలానికి, శ్రేయస్సుకు, దైవత్వానికి స్వరూపంగా మాతృభూమిని కీర్తించే ఈ గేయం, దేశ ఐక్యత, ఆత్మగౌరవ స్ఫూర్తికి కవితాత్మక వ్యక్తీకరణ అనతికాలంలోనే ఇది దేశభక్తికి శాశ్వత చిహ్నంగా నిలిచిందన్నారు.బంకించంద్ర ఛటర్జీ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు సరితా రెడ్డి, హాజీ మియా, వినోద్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకం కింద కోళ్ల పెంపకానికి చేయూత



రాజేంద్రనగర్(ప్రశ్న న్యూస్) ఉపాధి హామీ పథకం కింద గ్రామీణ రైతులకు కోళ్ల పెంపకానికి కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తుందని కవ్వ గూడ గ్రామ కార్యదర్శి వజ్ర లింగం తెలిపారు. శుక్రవారం కవగుడ గ్రామంలో గ్రామ సభను ఏర్పాటు చేసి ఉపాధి హామీ పథకం వివరాలను గ్రామస్తులకు తెలియజేశారు. గ్రామానికి చెందిన రైతులు ఎవరైనా ముందుకు వస్తే వారి సొంత భూమిలో కోళ్ల షెడ్ల నిర్మాణానికి ప్రభుత్వం లక్ష ఇరవై ఐదు వేల రూపాయల వరకు సబ్సిడీతో కూడిన నిధులు అందజేయనున్నదని తెలిపారు. గ్రామీణ ప్రాంత రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దేవరకొండ రమేష్ యాదవ్. మెట్టు రాజేందర్. మాజీ ఎంపిటిసి నాగేష్ ముదిరాజ్. పంచాయతీ కారోబార్ పెంటయ్య. స్థానిక నాయకులు కుక్కల బాలు. ప్రవీణ్. చందు. సత్యం యాదయ్య జంగయ్య రమేష్ గౌడ్. సిద్దు యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## నర్కుడ మాజీ సర్పంచ్ గూడపు వీరయ్య కు నివాళులు అర్పించిన నాయకులు



రాజేంద్రనగర్(ప్రశ్న న్యూస్) నర్కూడ గ్రామానికి సర్పంచ్ గా గూడెపు వీరయ్య చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచి ఉంటాయని రాజేంద్రనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గూడెం రాజేందర్ అన్నారు. గూడెపు వీరయ్య ఆరవ వర్ధంతి సందర్భంగ శుక్రవారం నర్కుడ గ్రామంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ దారి కూడా గ్రామ అభివృద్ధి కోసం వీరయ్య అంకితభావంతో పని చేశారని ఆయన సేవలను ప్రజలు నిరంతరంస్మరిస్తూనే ఉంటారని అన్నారు. నరు కూడా గ్రామానికి ప్రత్యేక గుర్తింపు తేవడంలో ఆయన చేసిన కృషి అనితర సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు గూడెపు బలవంతరావు. రవి కిరణ్. లక్ష్మణరావు. కళ్యాణ్. రణదీప్. సంపత్. నరేందర్. నీరటి మల్లేష్ ముదిరాజ్. రాకేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశారదా విద్యా మందిరంలో ఘనంగా వందేమాతరం 150 వసంతాల సంబరాలు



రాజేంద్రనగర్(ప్రశ్న న్యూస్) భారతదేశ స్వతంత్ర సాధనలో రణనినాదంగా బ్రిటిష్ వారి గుండెల్లో వణుకు పుట్టించిన వందేమాతరం రచించి 150 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా శంషాబాద్ లోని శ్రీ శారద విద్యా మందిర్ విద్యార్థులు సామూహిక పూర్తి వందేమాతర గీతాలాపన గావించారు. ఈ సంబరాల సందర్భంగా దేశ ప్రజలంతా వందేమాతర గీతాలాపన గావింపవలయునని కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమం నవంబర్ 7 వ తేదీన ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో శంషాబాద్ మధురానగర్ లోని శ్రీ శారదా విద్యా మందిర్ విద్యార్థులు సామూహిక వందేమాతర గీతాలాపన గావించారు.ప్రస్తుతం మనం వందేమాతరం గేయం లోని కొద్ది భాగం మాత్రమే ఆలాపన చేస్తున్నప్పటికీ శారదా విద్యా మందిర్ విద్యార్థులు మాత్రం ప్రత్యేకంగా పూర్తి వందేమాతర గీతం అభ్యాసం చేసి జాతీయ ఝుండాలను చేతబూని పూర్తి వందేమాతర గీతాలాపన చేశారు.
మాతరం మాతరం - వందేమాతరం జై జై మాతభారత్ మాత అని నినదించారు.
ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మల్రెడ్డి దేవేందర్ రెడ్డి భారతదేశ స్వతంత్ర పోరాట సమయంలో వందేమాతరం ఒక నినాదంగా ఉద్భవించి బ్రిటిష్ వారిని గడగడ లాడించుటకు స్వతంత్ర సమరయోధులు ఒక మంత్రంగా ఉపయోగించి స్వతంత్ర సాధనలో ప్రముఖపాత్ర వహించిన విషయాన్ని విద్యార్థులకు వివరించారు.వందేమాతరం 150 వసంతాల సంబరాలలో భాగంగా విద్యార్థులు వందేమాతరం ఆంగ్ల అక్షరాల రూపంలో మరియు 150 అక్షరాల రూపంలో విద్యార్థులు ఆకారాలను ఏర్పాటు చేసి ఉత్సాహంగా భారతమాతకు జయ నాదాలు గావిస్తూ సంబరాలు జరుపుకున్నారు.ఉత్సవాలలో భాగంగా పాఠశాల ఉపాధ్యాయిని పావని వందేమాతర గేయం పై విద్యార్థులతో కలిసి చేసిన నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచినది.ఈ ఉత్సవాలలో పాఠశాల కరస్పాండెంట్ దేవేందర్ రెడ్డి ప్రధానోపాధ్యాయులు ఫాతిమా, సంధ్య, మనీషా, చిట్టి, రమాదేవి, అప్సర్ ఆసియా బేగం, సువర్ణ,అపర్ణ, అఖిల, దౌలత్ బి, తిరుమల రాణి, దివ్య, పావని తదితరులు పాల్గొన్నారు.

### వందేమాతరం గేయం రచించి 150 సం, సందర్భంగా

## సామూహిక వందేమాతర గేయాలపన

**హాజరైన జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే**



సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) దేశ స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో జాతీయ కవి, రచయిత బంకించంద్ర ఛటర్జీ గారు రచించిన వందేమాతరం గేయం 150 ఏండ్లు అయిన సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలోని పరేడ్ గ్రౌండ్‌లో వందేమాతరం గేయాన్ని సమూహంగా ఆలపించాడం జరిగింది. వందేమాతరం గేయాలపన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించగా జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే, ఇన్స్పెక్టర్ లు రవి, నాగేశ్వరరావు , మధుకర్, ఆర్.ఐ లు రమేష్, యాదగిరి, ఎస్.ఐ లు కిరణ్ కుమార్, క్రాంతి కుమార్, రాజు,సాయి కిరణ్,జిల్లా పోలీస్ కార్యాలయ అధికారులు, పోలీస్ సిబ్బంది హాజరై గీతలాపన చేశారు.



# గౌరీ కిషన్ ఎమోషనల్ పోస్ట్

సాధారణంగా కొందరు హీరోయిన్లను పలు ప్రశ్నలు అడుగుతూ ఇబ్బంది పెడుతుంటారు. ఇక ఇలాంటి సంఘటనలు ఇండస్ట్రీలో ఎన్నో సంఘటనలు చోటుచేసుకున్నాయి.హీరోయిన్లు సైతం తమకు అసౌకర్యంగా ఉన్న ప్రశ్నలు అడిగితే.. కొందరు మీడియాపై ఫైర్ అయ్యారు. అలాగే ఈ వివాదాలు కాస్త కేసుల వరకు కూడా వెళ్లాయి. ఇక ఇప్పుడు ఓ యంగ్ హీరోయిన్‌కు ఇలాంటి పరిస్థితే ఎదురైంది. చైల్డ్ ఆర్టిస్ట్‌గా ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చి ఎంతో పాపులారిటీ తెచ్చుకుని హీరోయిన్‌గా మారింది గౌరీ జి కిషన్. త్వరలో 'అదర్స్' చిత్రంతో రాబోతున్న ఈ భామ ఓ ప్రెస్‌మీట్‌లో పాల్గొనగా.. ఘోర అవమానం జరిగింది. ఇందులో ఓ రిపోర్టర్ మీ బరువు ఎంత? ఎంత పెరిగావ్ అని బాడీ షేమింగ్ చేశాడు.

ఇక ఈ విషయంపై ఆమె గట్టిగానే సమాధానం చెప్పింది. తాజాగా, ఈ విషయంపై గౌరీ సోషల్ మీడియా ద్వారా ఎమోషనల్ పోస్ట్ పెట్టింది. "జరిగిన దానికి పూర్తిగా దిగ్భ్రాంతి చెందాను. నటి బరువు గురించి తాను అడిగిన ప్రశ్న కరెక్టే అని ఒక పురుష జర్నలిస్ట్ పట్టుబట్టారు. ఇదేమీ కొత్త కాదు. బెదిరింపులు కొత్త కాదు, లైంగిక వేధింపుల ప్రశ్నలు కొత్త కాదు. రెండు రోజుల క్రితం, మరొక ప్రెస్ మీట్‌లో, ఒక పురుష రిపోర్టర్ కోయంబత్తూర్ కమిషనర్‌ను అత్యాచార బాధితురాలు "పూర్తిగా నగ్నంగా ఉందా లేదా అర్ధ నగ్నంగా ఉందా" అని అడిగాడు. ఇది జర్నలిజం కాదు. ఇవి వేధింపులతో సమానం. నా బరువు గురించి తెలుసుకోవడం మీకు ఎందుకు ముఖ్యం, అది సినిమాకి ఏమైనా సంబంధం ఉందా? ఇలాంటి ప్రశ్నలకు నేను సమాధానం చెప్పలేను? ఇది సరైన జర్నలిజం కాదు. ప్రతి స్త్రీకి ప్రత్యేక శరీర రకం ఉంటుంది. నాది భిన్నంగా ఉంది. నేను హార్మోన్ల సమస్యలతో పాటు అనారోగ్య సమస్యతో బాధపడుతున్నా. బహిరంగ ప్రదేశాలలో నాకు అసౌకర్యంగా అనిపించే దాని గురించి మాట్లాడటం నాకు అంత అవసరం లేదు. ఇక్కడ ఒక్క మహిళా జర్నలిస్ట్ కూడా లేరు.. నన్ను టార్గెట్ చేసి ఇలాంటి ప్రశ్నలతో చాలా ఇబ్బంది పెట్టారు చాలా బాధగా ఉంది" అని రాసుకొచ్చింది.

# నేను ఆ హీరోకు అస్సలు నచ్చలేదు



యంగ్ హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే 'మిస్టర్ బచ్చన్' చిత్రంతో వచ్చి భారీ పాపులారిటీ దక్కించుకుంది. కానీ హిట్ అందుకోలేకపోయింది. అమ్మడు అందానికి మార్కులు పడినప్పటికీ.. నటనకు మాత్రం ఒక్క హిట్ కూడా రాలేదు. భాగ్యశ్రీ బోర్సే నటించిన సినిమాలన్ని అంతంత మాత్రంగానే మెప్పించాయి. అయినా.. ఈ భామకు.. వరుస అవకాశాలు క్యూ కడుతున్నాయి. ప్రజెంట్ మలయాళ స్టార్ దుల్కర్ సల్మాన్ సరసన 'కాంత' మూవీలో నటిస్తోంది. పీరియాడిక్ బ్యాక్ డ్రాప్‌లో రాబోతుండగా.. రానా, సముద్రఖని కీలక పాత్రలో కనిపించబోతున్నారు. షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమా నుంచి ట్రైలర్ విడుదలై ప్రేక్షకులను ఊర్రూతలూకిస్తోంది. ఇక ఈ కార్యక్రమంలో పాల్గొన్న భాగ్యశ్రీ షాకింగ్ కామెంట్స్ చేసింది. "నేను ముందుగా చెన్నైకి వెళ్లాను. నా లుక్ టెస్ట్ అక్కడే జరిగింది. అక్కడున్న రానా గారు నా లుక్ టెస్ట్ చూసి హీరోయిన్‌గా నచ్చలేదని అన్నారు. అమ్మాయి చాలా బాగుంది.. చూడటానికి తప్ప యాక్టింగ్ తెలియదు అన్నాడు. మొదట ఈ సినిమాకు నన్ను తీసుకోలేవు. కానీ సెల్వ చాలా నమ్మకంగా ఉన్నారు. నేను డైలాగ్స్, సీన్స్ చేశాక అంతా సంతోషపడ్డారు. నేను కుమారిగా నటించగలనని నమ్మారు. ఈ అవకాశం ఇచ్చిన రానాకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. నేను విన్న మొదటి కథ కాంత. ఈ ప్రాజెక్ట్ నాకు చాలా చాలా స్పెషల్. మీ సపోర్ట్ చూస్తుంటే చాలా సంతోషంగా ఉంది" అని చెప్పుకొచ్చింది. దీంతో షాక్ అయిపోయిన రానా ప్రతి సారి నేను ఊరికే ఎందుకు విలన్ అయిపోతానో నాకు అర్థం కాదని ఫన్నీగా అనడంతో జనాలంతా నవ్వుతారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

# రా అండ్ రస్టిక్‌గా ఉంటుంది..




రాకింగ్ స్టార్ యష్ త్వరలో 'టాక్సిక్' మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నాడు. ప్రస్తుతం బెంగుళూరులో చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ యాక్షన్-ప్యాక్డ్ డ్రామా మార్చి 19, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది.ప్రేక్షకులు ఎంతో ఈగర్‌గా వెయిట్ చేస్తున్న ఈ మూవీలో క్రేజీ అండ్ సెన్సేషనల్ బ్యూటీ రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా నటిస్తుంది. ఇందులో భాగంగానే తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో అభిమానులతో చిట్ చాట్‌లో పాల్గొన్న ఈ బ్యూటీ 'టాక్సిక్' విశేషాలు పంచుకుంది. ''టాక్సిక్' అనేది ఇప్పటివరకు కన్నడ లేదా భారతీయ సినిమాల్లో మనం చూసిన వాటన్నింటికంటే భిన్నంగా ఉంటుంది. ఇది రా అండ్ రస్టిక్‌గా ఎన్నో లేయర్స్‌తో అద్భుతంగా ఉండబోతోంది. దర్శకురాలు గీతు విజన్ ఎంతో బోల్డ్‌గా ఉంటూనే.. అదే సమయంలో ఎంతో హృద్యంగానూ ఉంటుంది.. ఈ సినిమా ప్రేక్షకులకు మంచి ఎక్స్‌పీరియన్స్‌ను ఇస్తుంది' అంటూ రుక్మిణి చెప్పిన మాటలతో సినిమాపై అంచనాలు మరింతగా పెరిగాయి. కన్నడ, ఆంగ్ల భాషలలో చిత్రీకరించబడుతున్న ఈ భారీ సినిమా తెలుగు, తమిళం, హిందీ, మలయాళ భాషలలో ఒకేసారి రిలీజ్ అయ్యేందుకు సిద్ధం అవుతున్నది. కెవిఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ పతాకంపై వెంకట్ కె. నారాయణ, యష్ సంయుక్తంగా నిర్మిస్తున్నా ఈ చిత్రానికి అంతర్జాతీయంగా ప్రశంసలు పొందిన మేకర్ గీతు మోహన్‌దాస్ దర్శకత్వం వహిస్తున్నారు.

# అస్సలు తగ్గేదే లేదు అన్నట్లుగా పోస్టర్




కోలీవుడ్ స్టార్ హీరో దళపతి విజయ్ సినీ కెరీర్‌లోనే చివరి సినిమాగా రాబోతోన్న చిత్రం 'జన నాయగన్'. దీంతో ఈ చిత్రంపై ఫ్యాన్స్ అండ్ సినీ లవర్స్‌లో భారీ అంచనాలు నెలకొన్నాయి.దీనికి హెచ్. వినోద్ దర్శకత్వం వహిస్తుండగా.. కెవిఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఇందులో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తుండగా.. మమిత బైజు, ప్రియమణి, శృతి హాసన్, బాబీ డియోల్, మోనిషా బ్లెస్సీ, జోసెఫ్ విజయ్, గౌతమ్ మీనన్ కీలక పాత్రలో కనిపించబోతున్నారు. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ చిత్రం వచ్చే ఏడాది జనవరి 9న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతున్నట్లు ఇప్పటికే టీమ్ అఫీషియల్ అనౌన్స్‌మెంట్ ఇచ్చేసిన విషయం తెలిసిందే. కానీ వచ్చే ఏడాది సంక్రాంతి బరిలో పోటీ ఎక్కువగా ఉండటం కారణంగా ఈ సినిమా రిలీజ్ వాయిదా పడినట్లు పలు వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. దీంతో తాజాగా అసలు వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు అన్నట్లుగా.. వచ్చే ఏడాది సంక్రాంతి బరిలో జనవరి 9న రాబోతున్నట్లు తెలుపుతూ కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ఇందులో విజయ్ సరికొత్త లుక్‌లో కనిపిస్తూ ఆడియన్స్‌ను ఆకట్టుకుంటున్నాడు. అలాగే ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ నవంబర్ 8 న రాబోతున్నట్లు తెలుపుతూ ఓ పోస్టర్ రిలీజ్ చేశారు. దీంతో విజయ్ ఫ్యాన్స్ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# 'ఫంకీ' రిలీజ్ డేట్ ఫిక్స్



విశ్వక్ సేన్, కయాదు లోహర్ జంటగా కె.వి.అనుదీప్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'ఫంకీ'. ఈ సినిమాను వచ్చే ఏడాది ఏప్రిల్ 3న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. టీజర్‌తో వినోదాల విందుకి హామీ ఇచ్చిన ఈ సినిమాపై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. అందరూ అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న వినోదభరిత చిత్రాలలో ఒకటిగా ఈ సినిమా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ సినిమా కోసం స్వచ్ఛమైన వినోదాన్ని అందిస్తూ, ప్రేక్షకులను నవ్వులతో ముంచెత్తే అద్భుతమైన బృందం ఒకచోట చేరింది. దర్శకుడు కె.వి.అనుదీప్ తన శైలి కామెడీ విందుతో తిరిగి వచ్చారు. ఈసారి రెట్టింపు నవ్వులతో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించడానికి సిద్ధమవుతున్నారు. అలాగే విశ్వక్ సేన్ సినీ దర్శకుడి పాత్రను పోషిస్తుండటం విశేషం. కొత్త లుక్, కొత్త యాటిట్యూడ్‌తో ప్రేక్షకులను సరికొత్తగా అలరించనున్నారు. నాయిక కయాదు లోహర్ టీజర్‌లో తన అందంతో కట్టిపడేశారు. తెరపై విశ్వక్-కయాదు జోడి కొత్తగా, అందంగా కనిపిస్తూ.. యువత మనసు దోచుకుంటోంది. భీమ్స్ సిసిరోలియో సంగీతం ఈ చిత్రానికి అదనపు ఆకర్షణగా నిలవనుంది. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు.

# బ్రహ్మాచారి భర్త కావాలనుకుంటే?



వైఫ్ వర్సెస్ వారియర్, వైఫ్ వర్సెస్ పీస్ మ్యాన్, వైఫ్ వర్సెస్ సిజర్ మ్యాన్ అంటూ వరుసగా ప్రతీ మగాడి యుద్ధం (విజయం) వెనక ఓ ఆడది ఉంటుంది,స్వేచ్ఛ కోసం భర్త చేసే అలుపెరగని పోరాటం.. గొప్ప గొప్ప యుద్ధాలన్నీ భార్యతోనే.. అంటూ క్యాప్షన్స్ పెట్టి.. ప్రీ లుక్ పోస్టర్లతో ఆసక్తిని పెంచింది 'పురుష:' చిత్రయూనిట్. బత్తుల సరస్వతి సమర్పణలో కళ్యాణ్ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద బత్తుల కోటేశ్వరరావు తన తనయుడు పవన్ కళ్యాణ్‌ను హీరోగా పరిచయం చేస్తూ నిర్మిస్తున్న చిత్రమిది. ఈ సినిమాకు వీరు వులవల దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఇందులో ప్రధాన పాత్రలు పోషిస్తున్న పవన్ కళ్యాణ్, సప్తగిరి, కసిరెడ్డి రాజ్ కుమార్ పాత్రల స్వభావం, వాటి తీరుని ప్రతిబింబించేలా పోస్టర్‌ను డిజైన్ చేశారు. ఇక ఈ పోస్టర్ మీద 'బ్రహ్మాచారి భర్త కావాలని నిర్ణయించుకున్న తర్వాత జీవితం యుద్ధభూమిగా మారుతుంది..' ఉన్న కంటెంట్‌ను చూస్తే సినిమా ఎలా ఉండబోతోందో అర్థం అవుతోంది. పోస్టర్ రిలీజ్ చేసిన అనంతరం శ్రీకాంత్ ఓదెల చిత్ర యూనిట్‌కి ఆల్ ది బెస్ట్ తెలిపారు. వెన్నెల కిషోర్, వి.టి.వి.గణేష్, అనంత శ్రీరామ్, పమ్మి సాయి, మిర్చి కిరణ్ వంటి కమెడియన్స్ అద్భుతమైన పాత్రల్ని పోషిస్తున్నారు. అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్‌గా రానున్న ఈ సినిమాలో వైష్ణవి కొక్కుర, విషిక, హాసిని సుధీర్‌లు కథానాయికలుగా నటిస్తున్నారు. గబి రాక్, అనైరా గుప్తా కీలక పాత్రలు పోషించారు. ప్రస్తుతం చిత్ర యూనిట్ పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాల్లో బిజీగా ఉంది. ఆద్యంతం అందరినీ అలరించేలా ఈ చిత్రాన్ని రూపొందించారు.

# గురుశిష్యుల అహంకార యుద్ధం



దుల్కర్ సల్మాన్ నటిస్తున్న పీరియాడికల్ డ్రామా చిత్రం 'కాంత'. ఈనెల 14న విడుదల కానుంది. తాజాగా హీరో ప్రభాస్ లాంచ్ చేసిన ట్రైలర్ ఇంటెన్స్ ఎమోషనల్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌తో అందర్నీ అలరిస్తోంది. ఒక రైజింగ్ స్టార్, తనకి దారి చూపిన గురువు మధ్య ఉన్న ఎమిషన్‌ని ట్రైలర్ ఆసక్తికరంగా ప్రజెంట్ చేసింది. ఈ ఇద్దరి డ్రీం ప్రాజెక్ట్ 'శాంత' దగ్గరకి వచ్చేసరికి ఇగో వార్‌గా మారుతుంది. స్నేహం, ఆశయాల మధ్య నడిచే ఈ సంఘర్షణ 'కాంత' కథపై మరింత ఆసక్తిని పెంచింది. దర్శకుడు సెల్వమణి సెల్వరాజ్ ఈ కథను ఎమోషన్స్ హార్ట్ టచ్చింగ్ డ్రామాటిక్ సన్నివేశాలతో అద్భుతంగా ప్రజెంట్ చేశారు. ప్రతి ఫ్రేమ్‌లోనూ క్రియేటివ్ విజన్ కనిపించింది. దుల్కర్ సల్మాన్ తన అద్భుతమైన నటనతో వెర్సటిలిటీని నిరూపించాడు. గుర్తింపు కోసం ఆత్రుతగా ఉన్న కొత్త నటుడి నుంచి, స్టార్ డమ్‌కు చేరిన తర్వాత ఈగోని ప్రదర్శించే స్టార్‌గా అతని ట్రాన్స్ఫర్మేషన్ ఆసక్తికరంగా ఉంది. సముద్రఖని సహజమైన నటనతో గురువు పాత్రలో ఆకట్టుకున్నారు. భాగ్యశ్రీ బోర్స్ కథకు ప్రాణం పోసే పాత్రలో కనిపించారు. రానా దగ్గుబాటి పోలీస్ ఆఫీసర్‌గా ఎంట్రీ ఇవ్వడం కథలో కొత్త టెన్షన్, బలాన్ని తెచ్చింది. దుల్కర్ సల్మాన్ 'వేఫేర్ ఫిల్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్', రానా దగ్గుబాటి 'స్పిరిట్ మీడియా' సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

# విజ్ఞాన పోటీలు ఉత్సాహంగా

## విద్యార్థుల ప్రతిభ ప్రదర్శన



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండలంలోని కొదురుపాక ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల స్థాయి విజ్ఞాన పోటీలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల 8, 9, 10వ తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని టి–సాట్ మార్గదర్శకత్వంలో, ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి నెలుట్ల శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ విద్యాశాఖ ఆదేశాల మేరకు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడం, విజ్ఞానంపై ఆసక్తి పెంచడం లక్ష్యంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

**- విజేతల వివరాలు**

**- ఎలక్షన్ పోటీలు**

- 1వ స్థానం: హారిక (10వ తరగతి, విలాసాగర్ హైస్కూల్)
- 2వ స్థానం: శ్రీవర్ష (9వ తరగతి, కొదురుపాక హైస్కూల్)
- 3వ స్థానం: రోహిణి (10వ తరగతి, నర్సింగాపూర్ హైస్కూల్)

**-వ్యక్తిగత క్విజ్ పోటీలు**

- 1వ స్థానం: డి. రోహిణి (10వ తరగతి, నర్సింగాపూర్ హైస్కూల్)
- 2వ స్థానం: కె. అక్షిత (10వ తరగతి, మల్లాపూర్ హైస్కూల్)

**-గ్రూప్ క్విజ్ పోటీలు**

- 1వ స్థానం: కొదురుపాక హైస్కూల్
- 2వ స్థానం: మల్లాపూర్ హైస్కూల్

అలాగే వ్యాసరచన పోటీలు కూడా నిర్వహించగా, విద్యార్థులు సృజనాత్మకతను చాటారు. మండల స్థాయిలో విజేతలైన విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించారు.ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్.ఎం. బొలుగం శ్రీనివాస్,ఉషారాణి, రాములు, దుర్గారెడ్డి, నర్సయ్య, మోహనకృష్ణ, ప్రభాకర్ తదితర సీనియర్ టీచర్లు పాల్గొన్నారు.

# నూతన వధూవరులకు

## తూడి లచ్చన్న ఆశీస్సులు - శుభాకాంక్షలు



గంగాధర (ప్రశ్న న్యూస్) చొప్పదండి నియోజకవర్గం, గంగాధర మండలంలోని గోపాలరావుపల్లి గ్రామానికి చెందిన గుండెలి మల్లేశం సోదరుడు గుండెలి తిరుపతి కుమార్తె వివాహ వేడుకలో ప్రముఖ సామాజిక వేత్త, టీఎల్ యువసేన అధినేత తూడి లచ్చన్న హాజరై నూతన వధూవరులను సుఖసంతోషాలతో దాంపత్య జీవితం సాగాలని ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యువసేన సభ్యులు సైతం పాల్గొని, వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

# లక్ష్యంపై దృష్టి సారించి ముందుకు వెళ్లాలి

**- మంచిగా చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలి**

**- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**- మినీ స్టేడియంలో జిల్లాస్థాయి యువజన ఉత్సవాలు ప్రారంభించిన ఇంచార్జి కలెక్టర్**




సిరిసిల్ల( ప్రశ్న న్యూస్) యువత ఒక లక్ష్యాన్ని నిర్ణయించి, ముందుకు సాగాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు ఇచ్చారు. జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని 29వ జాతీయ యువజనోత్సవాలలో భాగంగా జిల్లాస్థాయి యువజన ఉత్సవాలు సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రాజీవ్ నగర్ మినీ స్టేడియంలో జిల్లాస్థాయి యువజనోత్సవాల కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. విద్యార్థులు, యువత స్వామి వివేకానందుని సందేశాలను స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు.

సోషల్ మీడియాను అవసరం మేరకు వాడాలని సూచించారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ కళాశాలల యువతీ యువకులు, కళాకారులు, వివిధ కళా బృందాలు పాల్గొన్నాయి. జానపద నృత్యాలు బృందం, జానపద గేయాలు జానపద గేయాలు బృందం, కథా రచన, పద్య రచన, కవిత్వం, చిత్రలేఖనం, వకృత్వం పోటీ నూతన ఆవిష్కరణలు ఇన్నోవేషన్ ఎగ్జిబిషన్ ఆఫ్ సైన్స్ మేళ వంటి పోటీలు నిర్వహించగా, దాదాపు 400 మంది యువతీ యువకులు, కళాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూపారెడ్డి, జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి ఏ రాందాస్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఆర్ఎంపీల పైన ఆరోగ్యశాఖ అధికారుల ఆంక్షలు కరువు.

**అర్హత లేని ఆర్ఎంపీల సొంత హాస్పిటల్ ల పై తనిఖీలు నిర్వహించాలి.**

**డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గొర్రెంకల సురేష్.**







మంథని (ప్రశ్న న్యూస్) మంథని మున్సిపల్ పరిధిలో కొందరు ఆర్ఎంపీలు గ్రామాల్లో ప్రథమ చికిత్స చేయడం మరిచి మంథని పట్టణ కేంద్రంలో అర్హత లేకున్నా సొంతంగా ఆస్పత్రులు నిర్వహించి మెడికల్ షాపులను సైతం ఏర్పాటు చేసుకొని తప్పుడు వైద్యం అందిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు గతంలో మంథని డివిజన్ కేంద్రంలో ఆర్ఎంపీల వైద్యం వికటించి అనేకమంది యువతి,యువకులు ప్రాణాలు కోల్పోవడం జరిగింది ఓపి బిల్లు లేదంటూ నిరుపేదల రాకను ఆసరాగా చేసుకొని ఒకే రకమైన మాత్రలు ఇస్తూ అవసరం లేకున్నా సెలైన్లు ఎక్కించి పంపిస్తున్నారు తమకు ఇష్టమైన రీతిలో యాంటీబయాటిక్స్, నొప్పుల మాత్రలు అడ్డగోలుగా రాసి బలవంతంగా పేషంట్లతోని తమ మెడికల్ షాపులోనే మందులను కొనిపించి సొమ్ము చేసుకుంటున్నారు.అర్హత లేకున్నా మందులు అమ్మడం ఫస్ట్ ఎయిడ్ క్లినిక్ ల బోర్డు పెట్టి లోపల మూడు రూములు ఐదు బెడ్లతో పేషెంట్లకు ట్రీట్మెంట్ చేస్తుండడం పట్ల అగ్రహం వ్యక్తం చేస్తూ క్లినిక్ ల పేరిట నిబంధనలకు విరుద్ధంగా వైద్యం చేస్తున్న ఆర్ఎంపీ డాక్టర్ల హాస్పిటల్స్ మీద జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు దాడులు నిర్వహించాలని కాగా గత పది రోజుల క్రితం మంథని కేంద్రంలో అనుమతులు లేని ప్రైవేట్ ఆస్పత్రులను తనిఖీలు నిర్వహించిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తనిఖీల్లో పలు ప్రైవేట్ ఆస్పత్రులకు నోటీసులు ఇవ్వడంతోనే సరిపెట్టగా అధికారులు తనిఖీలకు వచ్చినప్పుడు అర్హత లేని ఆర్ఎంపీలు ఏర్పాటుచేసిన ఆస్పత్రులను తనిఖీలు చేయడం మరిచారని మరొకసారి అనుమతులేని పలు ప్రైవేట్ హాస్పిటల్ ల తోపాటు ఆర్ఎంపీలు సొంతంగా నిర్వహించి వైద్యం చేస్తున్న ఫస్ట్ఎయిడ్ క్లినిక్ ల పేరిట వైద్యం అందిస్తున్న ఆర్ఎంపీల హాస్పటల్ల మీద సైతం తనిఖీలు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులను డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు డిమాండ్ చేశారు.

# కబాలిగా మారిన పెట్రోల్ బంకు కిబాల పత్రాలు


**-సర్వే. నం. 138 భూవివాదంలోని మాయలు మర్మాలు**

**-100 కోట్ల ప్రభుత్వ ఆస్తుల కబ్జా.? మరి పత్రాలెక్కడ.?**

**-డేంజర్ జోన్ గా మారిన పెట్రోల్ బంకు**

**-ప్రజల ప్రాణాలకు ప్రమాదంగా మారింది**






జగిత్యాల జిల్లా (ప్రశ్న న్యూస్) జగిత్యాల పట్టణ నడిరోడ్డున కొత్తబస్టాండ్ సర్కిల్ లోగల సర్వే. న%శీ%.138 లో ఉన్న 20 గుంటల భూమి సుమారు 100 కోట్ల విలువగల ప్రభుత్వ ఆస్తిని, రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులకు భిన్నంగా అక్రమంగా ఎన్నో ఏళ్లుగా కబ్జా చేయడమే కాకుండా పట్టణ అభివృద్ధికి ఆటంకంగా నిలిచి ఎన్నో ప్రమాదాలకు కారణం అయ్యి అటు ప్రభుత్వాన్ని ఇటు న్యాయస్థానాన్ని మోసం చేస్తున్న మాయలు మర్మాలు.ప్రభుత్వ ఆస్తిని కాపాడాలని జగిత్యాల జిల్లా ప్రజలు, ప్రజా సంఘాలు, నాయకులు కోరుతున్నారు. జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ ను కోరడం జరిగింది. దీనికి సంబంధించి నిత్యము అనేక వార్తా పత్రికల్లో, వార్తా ఛానళ్లలో రావడం జరిగింది. దీనికిజిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ స్పందించారు. జగిత్యాల అదనపు కలెక్టర్ రాజాగౌడ్ నేతృత్వంలోని విచారణ కమిటీని వేశారు.మున్సిపల్ భూమి ఆక్రమణపై పూర్తి విచారణ జరిపి నివేదికను అందజేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు.అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ) రాజాగౌడ్‌ను కమిటీ చైర్మన్‌గా, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, అర్బన్ తహసీల్దార్ రాంమోహన్, జగిత్యాల మున్సిపల్ కమిషనర్ స్పందనను సభ్యులుగా నియమించారు. మూడు నాలుగు రోజుల వ్యవధిలో మున్సిపాలిటీకి సంబంధించిన 20 గుంటల భూమిపై సంపూర్ణ విచారణను జరిపి నివేదికను అందించాలని ఆదేశించడంతోపాటు అదనపు కలెక్టర్ , రెవెన్యూ, మున్సిపల్ అధికారులకు సూచనలు చేశారు. కానీ ఇప్పటికే 4 రోజులు గడిచింది.

### పెట్రోల్ బంకు ప్రజల ప్రాణాలకు ప్రమాదం మారింది

జగిత్యాల పట్టణ కొత్తబస్టాండ్ కూడలిలో నడి రోడ్డున గల పెట్రోల్ బంకు ప్రజల ప్రాణాలకు ప్రమాదం మారిందని ప్రజలు, ప్రజా సంఘాలు అంటున్నాయి.నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ భద్రతా నిబంధనలు కు విరుద్ధంగా పెట్రోల్ బంకులు రోడ్డుకు అడ్డంగా ఉండరాదు. నివాస ప్రాంతాలకు,సున్నితమైన ప్రదేశాలకు నిర్దిష్ట దూరంలో ఉండాలి.పెట్రోల్ బంకులు అత్యంత సురక్షితమైన ప్రదేశాలలో ఉండాలి. పెట్రోల్ మండే ఆవిరిని విడుదల చేస్తుంది.గాలితో కలిపినప్పుడు,ఈ ఆవిరి మండే వాతావరణాన్ని ఏర్పరిచి తక్షణమే పేలిపోతుంది.

### కబాలిగా మారిన... కిబాల పత్రాలు 1953 నుండి వివరాలు

జగిత్యాల పట్టణం 1952 సం,, లో మున్సిపాలిటిగా ఆవిర్భవించింది. అదే సం.లో పట్టణంలో పెట్రోలు, డీజిల్, కిరోసిన్ అమ్మకాలు జరుపడానికి ఎటువంటి కంపెనీ లేని సందర్భంలో దారం వీరమల్లయ్య కంపెనీ పెట్టుటకు ముందుకు వచ్చిన సందర్భంలో మున్సిపాలిటీ వారు 138 సర్వే నెంబర్ లో 20గుంటల స్థలాన్ని కేటాయించినట్లు తెలుస్తుంది. 1953–54 కాస్రా పహాణిలో జగిత్యాల మున్సిపాలిటి పట్టాదారుడి కాలంలో దారం వీరమల్లయ్య అనుభవదారుడి కాలంలో చూపారు. 1958–59 పహణిలో మాత్రం దారం వీరమల్లయ్య పట్టాదారుడిగా చూపారు. “కిబాల” ద్వారా వచ్చినట్లు పట్టాదారు కాలంలో పేర్కొన్నారు. 1958–59 సం,,లో పహణిలో సర్వేనెం.138 ని రెండు డివిజన్లుగా చేశారు. సర్వే నెం.138ఎఅ, డివిజన్లో 13.19 ఎకరాల భూమిని మున్సిపల్ లోకల్ ఫండ్ “ యజమానిగా, 138ఎఆ డివిజన్లో దారం వీరమల్లయ్య 25 గుంటల భూమికి పట్టాదారుడిగా చూపారు. తరువాత 1976 – 77 సం. పహణీలో దారం వీరమల్లయ్యకు 20గుంటల స్థలం ఉన్నట్లు చూపారు. 1975 సం. లో దారం వీరమల్లయ్య చనిపోవడంతో వారి వారసుల పేర్లు 1976 – 77 సం,, పహణిలో పట్టాదారు కాలంలో వ్రాయడం జరిగింది. 1952 సం.లో కిబాల ద్వారా మున్సిపాలిటీ వద్ద 2,000 రూ. లకు స్థలాన్ని కొనుగోలు చేసినట్లు చెపుతున్న కీబాలను పరిశీలిస్తే 1952 సం. లో అధికారులు సంతకాలు చేసి జారీ చేసినట్లు ఉండగా, పత్రాలు 1958 లో జారీ చేసినట్లు ఉండటం పలు అనుమానాలకు తావిస్తుంది. ఈకీబాల పత్రం కూడ దారం వీరమల్లయ్య చనిపోయిన తరువాత అంటే 1975 తర్వాత బయటకు వచ్చినట్లు తెలుస్తుంది. ఎందుకంటే, పెట్రోలు, డీజిల్, కిరోసిన్ “బర్మా షెల్ కంపెనీ” వారు భూమిపై యాజమాన్య హక్కును నిరూపించు పత్రంలను సమర్పించ వలసినది కోరినప్పుడు ఈ భూమి ని పురపాలక సంఘం వద్ద నుండి పైలు నెం. 315, తేది : 2–7–1952 ద్వారా కొన్నట్లుగా దరఖాస్తు మాత్రమే ఇచ్చారు కాని ఏ విధమైన పత్రాలు సమర్పించ లేదు అని తెలిసింది తిరిగి 1964 సం.లో దుకాణ సముదాయాలు నిర్మాణం కొరకు మున్సిపల్ వారికి పర్మిషన్ కొరకు దరఖాస్తు పెట్టుకోగా, అభ్యంతరాలు రావడంతో పురపాలక సంఘం వారు కమిటి వేయగా, కమిటి విచారణ జరిపి 23–07–1964 న నిర్మాణ ఉత్తర్వులను నిలుపుదల చేయాలని ఉత్తర్వులు జారీ చేసారని తెలిసింది కాని, ఉత్తర్వులను బేఖాతరు చేసి అక్రమంగా దుకాణ సముదాయాలను నిర్మించారని తెలిసింది. 1964 సం.లో భూమిపై యాజమాన్య హక్కు గురించి వివాదం తలెత్తగా ఎటువంటి ఆధారాలు చూపించనీ దారం వీరమల్లయ్య గారు. కాని, దాదాపు 25సం, తర్వాత మున్సిపాలిటీ వారు. యాజమాన్య హక్కుల పైన 1984 లో, తిరిగి 1989 లో వివాదాలు తలెత్తగా ఓ ఎస్ నం. 4/84/1989 సం, కోర్టులో వివాదం పరి సమాప్తం చేయుట కొరకు కీబాలను తెరమీదకి తెచ్చి కోర్టులో ప్రవేశ పెట్టినట్లు తెలిసింది తిరిగి మున్సిపల్ కౌన్సిల్ 30/11/2004 రోజున పెట్రోల్ బంక్ స్థలాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవాలని తీర్మానం నెం: 140/2004 ద్వారా ఏకగ్రీవ తీర్మానం చేయడం జరిగింది. దీనితో మున్సిపల్ వారు వారసులనే ఆక్రమణ దారులకు నోటీసు పంపగా తిరిగి వారు హైకోర్టు ను ఆశ్రయించి రిట్ పిటిషన్ నం : 18940/2004 1623, 2604 మరియు 18298/ 2005 వేయగా హై కోర్టు అన్నింటిని కలిపి తేదీ: 16/10/2008 రోజున అన్ని అంశాలపైన విచారణ చేసి ఆక్రమణ దారులు సర్వేనెం: 138 లోని 20 గుంటలు స్వాధీనంలో ఉన్నప్పటికి యజమాన్యపు హక్కులు దృవీకరించుకోలేక పోవటంతో యాజమాన్యపు హక్కులకు సంబందించి ఇరువర్గాలు ఆక్రమణదారులు, మున్సిపాలిటి వారు యాజమాన్యపు హక్కులను తేల్చుకొనుటకు సివిల్ కోర్టుకు వెళ్ళాలని ఉత్తర్వు జారీ చేయటం జరిగింది. ఈ తీర్పును హైకోర్టు సింగిల్ బెంచ్ జడ్జి ఇవ్వగా తిరిగి ఆక్రమణదారులు డివిజన్ బెంచ్ కు ఆశ్రయించగా 16/12/2008 రోజున ఆక్రమణ దారులను ఫట్టాదారులుగా గుర్తించలేమని, మున్సిపల్ వారు మరియు ఆక్రమణ దారులను దిగువ సివిల్ కోర్టులో యాజమాన్య హక్కులను నిరూపించుకోవాలని తేల్చి చెప్పగా ఇరువురు ఇంత వరకు యాజమాన్య హక్కుల నిరూపణ కొరకు కోర్టును ఆశ్రయించక పోవటం గమనార్హం. మున్సిపల్ అధికారులు పట్టణానికి నడిబోడ్డున ఉన్న 20 గుంటల స్థలంలో కేవలం 4’గుంటల స్థలంలో బంక్ నడుపుతూ మిగిలిన స్థలంలో 16 గుంటలలో దుకాణ సముదాయాలను నిర్మించిన వాటికి ఇంటి నెంబర్లు కేటాయించి ఫన్నులు వసూలు చేయడం వీరి పనితీరుకు అద్దం పడుతుంది. గతంలో 1964లో దుకాణ సముదాయాల నిర్మాణాలు చట్ట విరుద్దం అని మున్సిపాలిటీ వారే నోటీస్ లిచ్చి ఎటువంటి కూల్చివేతలు చేయకుండా తిరిగి మొన్నటికి మొన్న మున్సిపాలిటీ ఆస్తి అని తెలిసి కూడ 2019 లో తిరిగి మంచాల రామేశం పేరు మీద ఫైల్ నం. 3009/డబ్ల్యూ/2/2019/1125 ద్వారా ఇంటి అనుమతి కొరకు దరఖాస్తు 12/12/2019 రోజున చేసుకోగా 29/01/2020 రోజున పర్మిషన్ ఇవ్వడం అదికారుల అవినీతికి అద్దం పడుతుంది.

## కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపే లక్ష్యంగా

# కాంగ్రెస్ శ్రేణుల ఎన్నికల ప్రచారం

**- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో**

**బోయినిపల్లి కాంగ్రెస్ నాయకుల విస్తృత ప్రచారం**






బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నవీన్ కుమార్ యాదవ్ కు మద్దతుగా చొప్పదండి శాసనసభ్యులు డాక్టర్ మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు సోమాజిగూడ డివిజన్ లోని ఎల్లారెడ్డిగూడ కాలనీలో బోయినిపల్లి మండల కాంగ్రెస్ శ్రేణులు శుక్రవారం విస్తృత ఎన్నికల ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బోయినిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు గడప గడపకూ వెళ్లి ఓటర్లను సంప్రదించి, నవీన్ కుమార్ యాదవ్ ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో బోయినిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వన్నెల రమణ రెడ్డి, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ముదుగంటి సురేందర్ రెడ్డి, సెస్ డైరెక్టర్ కొట్టెపల్లి సుధాకర్,సింగిల్ విండో చైర్మన్ వేసిరెడ్డి దుర్గా రెడ్డి,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నిమ్మ వినోద్ రెడ్డి,మాజీ జడ్పీటీసీ పులి లక్ష్మీపతి గౌడ్,మాజీ సెస్ డైరెక్టర్ ఏనుగుల కనుకయ్య, మాజీ సర్పంచ్ సంబ లక్ష్మీరాజం,మాజీ ఎంపీటీసీ అక్కెనపల్లి ఉపేందర్,వరాల నర్సింగం,కొలుపుల ప్రవీణ్, దిలీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రజలతో మమేకమవుతూ నవీన్ కుమార్ యాదవ్ అభ్యర్థిత్వానికి మద్దతు ఇవ్వాలని, కాంగ్రెస్ పార్టీనే ప్రజల సమస్యలను పరిష్కరించగల ఏకైక శక్తిగా నాయకులు పేర్కొన్నారు.

# చేవెళ్ల రహదారి ఇప్పటికైనా బాగుపడేనా.?

## ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యమే రోడ్డు ప్రమాదాలకు కారణమా.?

- ప్రతిపక్షం, పాలకపక్షం ఒకరిపై మరోకరు దుమ్మెత్తి పోసుకోవడంతో సమస్య తీరేనా.?
- పదేండ్ల పాటు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ పార్టీ రోడ్డు విస్తరణను నిర్లక్ష్యం చేసింది
- బీఆర్ఎస్ అధికారం పోయిన వెంటనే గగ్గోలు పెట్టడంలో అంతర్యమేంది
- జాతీయ రహదారి విస్తరణపై కేంద్ర ప్రభుత్వ భాధ్యతెంతా.?
- ఇప్పటికైనా రోడ్డు విస్తరణకు పట్టిన గ్రహణం వీడేనా.?
- భాధిత కుటుంభాలకు జరిగిన నష్టానికి భాధ్యులెవరు.?
- ప్రమాదంలోని చావులకు భాధ్యత పాలకపక్షానిదా, ప్రతిపక్షానిదా.




**(ఆర్ కె-ప్రశ్న న్యూస్ బ్యూరో)**

రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలు జరగడమే తరువాయి ప్రతిపక్షం, పాలకపక్షం ఒకరిపై మరోకరు దుమ్మెత్తి పోసుకుంటు సమస్యను పక్కదారి పట్టించి భాధితులను రోడ్డున పడేస్తున్నారు. రాష్ట్రంలో రోజు రోజుకు పెరుగుచున్న రోడ్డు ప్రమాదాలకు భాధ్యతెవరిదనే ప్రశ్నలు వెల్లువెత్తుత్తున్నాయి. ఇటీవల చేవెళ్ళ సమీపంలోని మిర్జాగూడ గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాధంపై రకరకాల విశ్లేషణలు వస్తున్నాయి. ముఖ్యంగా ఈ ప్రమాధానికి కారణం రోడ్డు విస్తరణ చేయకపోవడమేనని విమర్శలు గుప్పు మంటున్నాయి. ఈ విషయానికి వస్తే రోడ్డు విస్తరణకు అడ్డు పడుతున్నదెవరనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.

### రోడ్డు విస్తరణలను నిర్లక్ష్యం చేసిన బీఆర్ఎస్ పార్టీ

పదేండ్ల పాటు రాష్ట్రాన్ని పాలించిన బీఅర్ఎస్ నాయకులు రాష్ట్రవ్యాప్తంగా అనేక రోడ్డు విస్తరణలను పూర్తిగా నిర్లక్ష్యం చేసి అధికారం పోవడంతోనే ప్రస్తుత ప్రభుత్వంపై గగ్గోలు పెడుతుండడం లోని అంతర్యమేందనే అనుమానాలు గుప్పుమంటున్నాయి. ఇక గత రెండేళ్ళుగా ప్రభుత్వంలో ఉన్న కాంగ్రెస్ నాయకులు రోడ్డు విస్తరణపై ముందడుగు వేయకపోవడానికి గల కారణం ఏందనే దానిపై అయోమయం నెలకొంది. ఇక నేషనల్ హైవేల విస్తరణలో భాగంగా తాండూర్ హైదరాబాద్ జాతీయ రహదారి (ఎన్.ఏచ్.165) పై కేంద్ర ప్రభుత్వం చూపుతున్న పూర్తి నిర్లక్ష్యమే ప్రమాదాలకు కారణమని ఒకరిపై మరోకరు ఆరోపణలు చేసుకోవడంతో సమస్యకు పరిష్కారం దోరుకుతుందా.? అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇక విషయానికి వస్తే చేవెళ్ళ పరిధిలోని మీర్జాగూడ ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో 20 మంది అమాయకులు దుర్మరణం చెందడంపై మీడియాలో రకరకాల విశ్లేషణలు వస్తున్నాయి. ఈ రోడ్డు బాగోలేదని విస్తరణకు అనేక అడ్డంకులు ఏర్పడుతున్నాయని, ఈ రోడ్డును కనుక విస్తరిస్తే ప్రమాదాలు జరిగే అవకాశం లేదని విశ్లేషణలు వినిపిస్తున్నాయి. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే మృతుల కుటుంబాలను పరామర్శించడానికి అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు రావడంతో సహజంగానే సంఘటన జరిగిన ప్రాంతంలో హడావిడిగా పోలీసులు వచ్చి బందోబస్తు ఏర్పాటు చేసి రాజకీయ నాయకులకు భద్రత కల్పించారు. ఆ తర్వాత బాధితులతో రాజకీయ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం తరఫున పరిహారం వచ్చేందుకు కృషి చేస్తామని అధికార పార్టీ నాయకులు, జరిగిన ఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని ప్రతిపక్ష నాయకులు మీడియా సాక్షిగా దుమ్మెత్తి పోసుకున్నారు.

### బీఆర్ఎస్ పార్టీ మాజీ మంత్రులే కారణమా.?

చేవెళ్ల ప్రమాదానికి సంబంధించి ఒక వ్యక్తి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సంచలనంగా మారాయి. ఈ ప్రమాదానికి కారణమేమిటో ఆయన స్వయంగా వెల్లడిస్తు ఈ ఘోర రోడ్డు ప్రమాదానికి కారణం మాజీ మంత్రి మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే యాదయ్య, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అని ఆరోపిస్తు ఈ రోడ్డు విస్తరణకు వీరు అడ్డంకులు సృష్టించడంతో నిర్మాణం ముందుకు సాగడం లేదని, ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని, రోడ్డు విస్తరణకు కనుక సహకరించి ఉంటే ఈ దారుణం చోటుచేసుకుని ఉండేది కాదని పేర్కొన్నాడు. ఇక ఎంఎల్ఏ యాదయ్య మాజీ మంత్రి సభితా ఇంద్రారెడ్డి, మృతుల కుటుంబాలను పరామర్శించడానికి సంఘటన స్థలానికి వచ్చినప్పుడు అక్కడున్న వారంతా ఆందోళనకు దిగి అక్కడి నుంచి వెళ్లిపోవాలని డిమాండ్ చేశారు. దీంతో ఎంఎల్ఏ.యాదయ్య వచ్చిన దారిన వెళ్లిపోగా మరోవైపు మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని కూడా వెళ్లిపోవాలని బాధితులు డిమాండ్ చేస్తు తమ వాళ్ళ ప్రాణాలు పోవడానికి కారణం మీరేనంటు ఆమెపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మొత్తానికి ఈ రోడ్డు విస్తరణకు అటు ప్రతిపక్ష ఇటు అధికార పక్ష నాయకులు అడ్డుపడుతున్న నేపథ్యంలో ఈ ప్రమాదం జరిగిందని అక్కడి ప్రజలు, వాహనదారులు ఆరోపిస్తున్నారు. మరి ఈ రోడ్డు విస్తరణకు పట్టిన గ్రహణం ఎప్పుడు వీడుతుందో వేచిచూడాలి.

### ప్రజల్లో చైతన్య రావాలి

గత పదేండ్లుగా అనేక ప్రమాదాలు జరిగి వందలాది మంది అమాయకుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నను రోడ్డు విస్తరణ చేయడంలో గత కెసిఆర్ ప్రభుత్వం చూపిన నిర్లక్ష్యమే నేటి ప్రమాదాలకు కారణం.

రోడ్డు ప్రమాధాలు జరిగిన వెంటనే గద్దల్లా రాజకీయ నాయకులు వాలిపోయి అమలుకాని హామీలతో భాధిత కుటుంబాలను అఘాధంలోకి నెడుతున్నారు. ఇప్పటికైన ప్రజలు అప్రమత్తమై నాయకుల కల్లబొల్లి మాటల ఉచ్చులో పడకుండా తమ న్యాయమైన హక్కుల కోసం ప్రజాప్రతినిధులను నీలదీసే రోజు వస్తేనే ప్రజల బ్రతుకులు మారతాయి. నాయకుల పంచన చేరి మోసపోతున్న ప్రజల్లో మార్పుకోసం వేచిచూడాల్సిందే.

# గ్రహణం వీడాలి.. కేసీఆర్ రావాలి

### – కాంగ్రెస్ పాలన గ్రహణంలా పట్టిందన్న కేటీఆర్




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్రానికి, ప్రత్యేకంగా హైదరాబాద్ నగరానికి పట్టిన గ్రహణం వీడాలంటే మళ్లీ కేసీఆర్ పాలన రావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో ఓ ఆసక్తికర పోస్ట్ చేశారు. 2014 నుంచి 2023 వరకు కేసీఆర్ నాయకత్వంలో హైదరాబాద్ అభివృద్ధి అప్రతిహతంగా కొనసాగిందని కేటీఆర్ గుర్తుచేశారు. ఆ పదేళ్లలో ఐటీ, ఫార్మా సహా అన్ని రంగాలు వేగంగా అభివృద్ధి చెందాయని తెలిపారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వెల్లువెత్తాయని, శాంతిభద్రతల పరిరక్షణ నుంచి పర్యావరణ పరిరక్షణ వరకు ప్రతీ అంశంలోనూ తమ ప్రభుత్వం అద్భుతంగా పనిచేసిందని పేర్కొన్నారు. ఆ అభివృద్ధి ఫలాలు నగరంలోని ప్రతి పౌరుడికీ అందాయని, హైదరాబాద్ కీర్తిని ప్రపంచవ్యాప్తంగా నిలబెట్టామని ఆయన కొనియాడారు. అయితే, గత రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో నగరం కీర్తి మసకబారిందని కేటీఆర్ విమర్శించారు. అన్ని రంగాల్లో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని ఆరోపించారు. "రాష్ట్రానికి, హైదరాబాదుకు పట్టిన ఈ గ్రహణం వీడాలి. మళ్లీ కేసీఆర్ రావాలి" అంటూ తన పోస్టులో పేర్కొన్నారు.

# సొంత చెల్లిని, మాగంటి తల్లిని కేటీఆర్ మోసం చేశారు

### -కేటీఆర్, హరీశ్‌పై మంత్రి సీతక్క ఫైర్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్ రావులపై మంత్రి సీతక్క తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వారిద్దరి హడావిడి చూస్తుంటే బీఆర్ఎస్‌కు ఓటమి ఖాయమని అర్థమవుతోందని ఆమె ఎద్దేవా చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడిన ఆమె, కేటీఆర్, హరీశ్ రావుల తీరుపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్ తన సొంత చెల్లితో పాటు మాగంటి తల్లిని కూడా మోసం చేశారని సీతక్క ఆరోపించారు. "మాగంటి తల్లి ఆవేదన చూస్తే కేటీఆర్ ఎంత మోసకారో స్పష్టమవుతోంది. 91 ఏళ్ల వృద్ధురాలని కూడా చూడకుండా ఆమెను అవమానపరిచారు. ఈ ఆరోపణలపై కేసీఆర్ సమాధానం చెప్పాలి. కేటీఆర్ తీరును తెలంగాణ మహిళలందరూ గమనించాలి" అని ఆమె కోరారు.అనంతరం హరీశ్ రావుపై విమర్శలు గుప్పించారు. "నిశ్శబ్ద విప్లవం అని హరీశ్ రావు ప్రగల్భాలు పలుకుతున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఇదే మాట అన్నారు. కానీ ఆ నిశ్శబ్ద విప్లవమే మిమ్మల్ని నిండా ముంచింది. నిన్నటి వరకు విషాదంలో ఉన్న ఆయన, ఇప్పుడు హడావుడిగా బయటకు వచ్చి ఎందుకు ప్రచారం చేస్తున్నారు? ఓటమి భయంతోనే 24 గంటలు గడవకముందే ప్రచారానికి వచ్చారు" అని సీతక్క విమర్శించారు. ఓటమి తప్పదని తెలిసి వాస్తవాలు దాచిపెట్టి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనపై కూడా సీతక్క తీవ్ర విమర్శలు చేశారు. "తెలంగాణలో వైన్, మైన్, ల్యాండ్, శాండ్ మాఫియాలతో మీరు విధ్వంసకర పాలన సాగించారు. అందుకే గత ఎన్నికల్లో ప్రజలు మీకు తగిన గుణపాఠం చెప్పారు. పదేళ్లలో కనీసం ఒక్క కొత్త రేషన్ కార్డు ఇవ్వని దుష్ట పాలన కేసీఆర్‌ది. మీరు ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే, రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని విడిపిస్తోంది" అని అన్నారు. తమ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం వంటి పథకాలతో ప్రజల సమస్యలను పరిష్కరిస్తోందని తెలిపారు. హైదరాబాద్‌లో కనీస మౌలిక వసతులు కల్పించకుండా నగరాన్ని ముంచింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఆమె ఆరోపించారు.

# ప్రజాస్వామ్యంలో పార్టీలు కాదు : నాయకుడు ముఖ్యం

- ఇండిపెండెంట్ అభ్యర్థులను గుర్తించండి, గెలిపించుకోండి
- ప్రజల ఆలోచనల్లో మార్పు అవసరం : మంచి నాయకుడిని ఎంచుకుంటేనే మంచి పాలన
- హామీలకే పరిమితమయ్యే నాయకులు అభివృద్ధి ఎప్పటికీ చేయలేరు
- పార్టీల హామీలు నమ్మి ఓటు వేస్తే నష్టపోయేది ప్రజలే



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ప్రతీ ఎన్నికల సమయంలో ఒకే దృశ్యం ౦ పార్టీ చిహ్నాల ఆధారంగా ఓట్లు వేయడం, డబ్బులు,మద్యం ప్రలోభాలకు లొంగిపోవడం,చివరికి అభివృద్ధి లేకపోవడంపై ప్రజలు ఫిర్యాదులు చేయడం, కానీ ఒక సారి ప్రజలు ఆలోచించాల్సిన సమయం వచ్చింది "పార్టీ"లు కాదు, "నేత" ముఖ్యం.ఇప్పుడు జరుగుతున్న ఎన్నికల్లో కూడా చాలామంది ఓటర్లు పార్టీకి అంకితభావంతో ఓటు వేస్తున్నారు. అయితే ఎన్నికలు జరిగినప్పుడల్లా పార్టీలు మారినా ప్రజల జీవితాల్లో పెద్దగా మార్పు రావడం లేదు. కారణం స్పష్టమైన నాయకత్వ లక్షణాలు లేని వ్యక్తులు గెలవడం. అభివృద్ధి, సంక్షేమం గురించి మాట్లాడే బదులు వారు కేవలం రాజకీయ, సొంత లాభాలకే ప్రాధాన్యత ఇస్తున్నారు ఇక అభివృద్ధి ఏమి చేస్తారు. ఓటర్లలో ఈ దోరణి మారకపోతే ప్రజాస్వామ్యం అసలు ఉద్దేశం నశిస్తుంది. డబ్బు ఇచ్చినవారిని గెలిపిస్తే వారు తిరిగి ప్రజల కోసం పనిచేస్తారా.? పెట్టిన డబ్బుకు 100% తిరిగి సంపాదించే పనిలోనే ఉంటారా.. అనే ప్రశ్న ప్రతి ఓటరు మనసులో రావాలి.నిజాయితీగా పనిచేయగల, ప్రజల సమస్యలు అర్థం చేసుకునే స్వతంత్ర అభ్యర్థులను (ఇండిపెండెంట్స్) కూడా ఓటర్లు పరిశీలించాలి. పార్టీ ఆశ్రయం లేకుండా ప్రజలలో నిలబడగలిగే నేతలకే అసలు నాయకత్వం ఉంటుంది. వారు అధికారంలోకి వస్తే పార్టీ ఒత్తిడి లేకుండా ప్రజల కోసం నిజమైన సేవ చేయగలరు ఇది వాస్తవం ప్రజలు గుర్తించాలి. దీనిపైప్రజల ఆలోచనల్లో మార్పు రావాలి. అభివృద్ధి, సదుపాయాలు, ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేసే నిజమైన నాయకులను ప్రజలు ఎంచుకోవాలి. పార్టీ చిహ్నం కంటే నాయకుడి స్వభావం,పనితనం, నిబద్ధతనే ప్రధానంగా చూడాలి.మంచి నాయకులను ఎంచుకుంటేనే మంచి పాలన దొరుకుతుంది ప్రజల సమస్యలు తీరుతాయి.డబ్బుకు ఓటేస్తే అభివృద్ధి కలగానే మిగిలిపోతుంది.ప్రజల చేతుల్లోనే మార్పు ఉంది, ఆ మార్పు ఓటుతో మొదలవుతుంది. ప్రజలు పార్టీలు ఇచ్చే తాయిలాలకు అమ్ముడుపోయి ప్రజలకు సేవ చేసే నాయకులకు ఓటు వేయకుండా పార్టీకి ఓటు వేస్తూ ఇన్ని సంవత్సరాలుగా అనేక కష్టాలు అనుభవిస్తున్నారు మరి సేవ చేయాలన్న చిత్తశుద్ధితో ఎంతోమంది ఇండిపెండెంట్ అభ్యర్థులు బరిలో ఉన్నారు వాళ్లని ప్రజలు గుర్తించి ఓటు వేసి గెలిపిస్తే వాళ్లు నిబద్ధతతో ప్రజలకు సేవ చేస్తారు వాళ్ళ నియోజకవర్గాలను అభివృద్ధి చేస్తారు అన్న సంగతి ప్రజలు గుర్తించక పోవడంతోనే సంవత్సరాలు దశాబ్దాలు గడిచి పోతున్న అభివృద్ధికి నోచుకోని ఎన్నో నియోజకవర్గాలు గ్రామా లుగా దర్శనమిస్తున్నాయి. మరి ప్రజలు ఇప్పటికైనా మారి వాళ్ళ నియోజకవర్గాలలోమంచినాయకుడినిఎంచుకోవాలని కోరుకుందాం

# కర్నూలు బస్సు అగ్నిప్రమాదం కేసులో కీలక పరిణామం

### – వి కావేరి ట్రావెల్స్ యజమాని వినోద్ కుమార్ అరెస్ట్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర విషాదాన్ని నింపిన కర్నూలు బస్సు అగ్నిప్రమాదం కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ ఘటనలో ప్రధాన నిందితుల్లో ఒకరైన వేమూరి కావేరి ట్రావెల్స్ యజమాని వేమూరి వినోద్ కుమార్‌ను కర్నూలు పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. అనంతరం కోర్టులో హాజరుపరచగా, ఆయనకు బెయిల్ మంజూరు కావడంతో వెంటనే విడుదలయ్యారు. వివరాల్లోకి వెళితే, గత నెల అక్టోబర్ 24న హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న కావేరి ట్రావెల్స్‌కు చెందిన బస్సు ప్రమాదానికి గురైంది. కర్నూలు జిల్లా ఉలిందకొండ మండలం చిన్నటేకూరు వద్ద రోడ్డుపై ఆగి ఉన్న ఓ బైక్‌ను బస్సు ఢీకొట్టడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ఘోర దుర్ఘటనలో 19 మంది ప్రయాణికులు సజీవ దహనమయ్యారు. ఈ ఘటనపై ప్రమాదం నుంచి బయటపడిన రమేష్ అనే ప్రయాణికుడు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ఈ కేసులో బస్సు డ్రైవర్ మిర్యాల లక్ష్మయ్యను ఏ1 నిందితుడిగా చేర్చి ఇప్పటికే అరెస్ట్ చేశారు. తాజాగా, బస్సు యజమాని వేమూరి వినోద్ కుమార్‌ను ఏ2 నిందితుడిగా పేర్కొంటూ అరెస్ట్ చేశారు. అనంతరం ఆయన్ను స్పెషల్ మొబైల్ కోర్టులో హాజరుపరిచారు. విచారణ జరిపిన న్యాయమూర్తి, రూ.10 వేల సొంత పూచీకత్తుపై వినోద్ కుమార్‌కు బెయిల్ మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. కాగా, ప్రమాదానికి గురైన బస్సు విషయంలో యాజమాన్యం నిబంధనలు ఉల్లంఘించినట్లు తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. సీటింగ్ పర్మిషన్ ఉన్న బస్సును అక్రమంగా స్లీపర్ కోచ్‌గా మార్చి నడిపినట్లు అధికారులు గుర్తించారు. ఈ కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా రవాణా శాఖ అధికారులు కఠిన నిబంధనలు అమలు చేయాలని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# ఆర్టీసీ శుభవార్త.. ఆ నాలుగురోజులు నాలుగువేల బస్సులు!




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్** ఆసియాలోనే అతిపెద్ద జాతర, విగ్రహాలు లేని విశిష్టమైన జాతర, తెలంగాణ కుంభమేళాగా చెప్పుకునే మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు శర వేగంగా పనులు జరుగుతున్నాయి. 2026 సంవత్సరంలో జనవరి 28వ తేదీ నుంచి 31వ తేదీ వరకు నాలుగు రోజులపాటు జరిగే మేడారం మహా జాతరకు కోటి మందికి పైగా భక్తులు తరలివస్తారని భావిస్తున్నారు. ప్రతి సంవత్సరం మినీ మేడారం జాతర జరుగుతుండగా, రెండేళ్లకోసారి మహా జాతర జరుగుతుంది. భక్తులకు శుభవార్త చెప్పిన ఆర్టీసీ అటువంటి మేడారం మహా జాతరకు ఇప్పటినుంచే అన్ని విభాగాల నుండి పనులు చేస్తున్నారు. మేడారం మహా జాతర నేపథ్యంలో తెలంగాణ ఆర్టీసీ భక్తుల కోసం శుభవార్త చెప్పింది. భక్తుల సౌకర్యార్థం నాలుగు వేల ఆర్టీసీ బస్సులను నడపాలని ఆర్టీసీ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే మేడారం జాతరకు కావలసిన రోడ్ల అభివృద్ధి పనులను, భక్తులకు కావాల్సిన మౌలిక వసతులను కల్పించడం పైన దృష్టి సారించిన ప్రభుత్వం ఈ మేరకు తగు చర్యలు తీసుకుంటుంది. కొత్త బస్టాండ్ కు భూమి పూజ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నాలుగువేల బస్సులను నడుపుతామని ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్, వరంగల్ ఆర్ఎండి వెల్లడించారు. ఈ క్రమంలో వీరు మేడారంలో పర్యటించి అక్కడ బస్టాండ్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. మేడారంలో వై జంక్షన్ లో కొత్తగా నిర్మించబోయే బస్టాండ్ కు, ఆర్టీసీ అధికారులు భూమిపూజ చేసి, మేడారం మహా జాతరకు ఎటువంటి ఇబ్బంది లేకుండా భక్తుల కోసం ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తామని స్పష్టం చేశారు. ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించొద్దు వై జంక్షన్లో కొత్త బస్టాండ్ ను నిర్మిస్తున్నట్టు వెల్లడించారు. భక్తులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించకుండా, ఆర్టీసీ బస్సులోనే ప్రయాణించి సంస్థను ఆదరించాలని వారు విజ్ఞప్తి చేశారు.మరోవైపు మేడారం మహా జాతర నేపథ్యంలో వైద్య ఆరోగ్య శాఖ 30 ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయనుంది. ఇదే విషయాన్ని ములుగు డిఎంహెచ్ఓ గోపాలరావు వెల్లడించారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588